ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

శనివారం 1 మార్చి 2025



5



8

మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తనిఖీలు చేశారు. ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ, ఆపరేషన్ థియేటర్లను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

- మంగళగిరి సిటీ

అమరావతికి అగ్రతాంబూలం

















రూ.కోట్లలో కేటాయింపులు.. గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులతో పాటు కొత్త ప్రాజెక్టులకు నిధుల వరద. శుక్రవారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతికి అగ్రతాంబూలం దక్కింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి అన్న పేరుకు.. రాజధాని పనుల అంశాలకే చోటు ఇవ్వకుండా సరిపెట్టారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిపై దృష్టి పెట్టడంతో పాటు నిధులు కేటాయించింది. తొలిబడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో రాజధాని పనులకు రూ.6 వేల కోట్లను ప్రత్యేకంగా కేటాయించింది. అంతేగాకుండా రాజధానిలోని వివిధ ప్రాజెక్టులకు నిధులు.. గతంలో నిలిచిపోయిన భూసేకరణకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు జరగడంతో ఉమ్మడి గుంటూరు జిల్లావాసులతో పాటు రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- గతంలో కంటే రాజధానికి రెట్టింపు నిధులు
- మార్చి 15 నుంచి జోరందుకోనున్న నిర్మాణ పనులు
- గుంటూరు ఛానల్ భూసేకరణకు రూ.100 కోట్లు
- ఆచార్య ఎన్జీ రంగా అగ్రి వర్సిటీకి రూ.507 కోట్లు
- గోదావరి - పెన్నా నదుల అనుసంధానానికి రూ.200 కోట్లు
- కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులపై హర్షం

నదుల అనుసంధానికి ఊతం

గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.200 కోట్ల మూలధనాన్ని కేటాయించి సాగునీటి రంగంపై తన చిత్తశుద్ధిని చాటుకున్నది. దీంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు పనులు మరికొద్ది రోజుల్లో పట్టాలెక్కి పరుగులు పెట్టనున్నాయి. ప్రాజెక్టు తొలిదశలో భాగంగా కృష్ణానది నుంచి నకరికల్లు వరకు గోదావరి వరద జలాలను ఎత్తిపోసి నాగార్జునసాగర్ కుడి కాల్వలో కలుపుతారు. పోలవరం ప్రాజెక్టుని 2027కి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నది. ఈ క్రమంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో సంబంధం లేకుండా గ్రావిటీ ద్వారా గోదావరి వరద నీటిని ప్రకాశం బ్యారేజ్‌కు తరలించనున్నారు. అక్కడి నుంచి ఐదు దశల్లో ఎత్తిపోతల పథకాలు, గ్రావిటీ ద్వారా ఏడు వేల క్యూసెక్కుల నీటిని నకరికల్లుకు తరలించి సాగర్ కాల్వలో కలిపేలా ప్రణాళిక రూపొందించారు. 2018లో సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో రూ.6020.15 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. తొలిదశ పనులకు సంబంధించి టీడీపీ హయాంలోనే భూసేకరణ పూర్తి చేసి, పనులు ప్రారంభించింది. అయితే వైసీపీ 2019లో అధికారంలోకి వస్తూనే వాటిని నిలిపేసి పల్నాడు కరువు దుర్భిక్ష పథకం అంటూ పేరు మార్చి మూలన పడేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రంగా వర్సిటీకి పూర్వ వైభవం

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేయబడిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ వైభవం దిశగా అడుగులు వేసేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరిపారు. రాష్ట్ర ఆహార భద్రతకు భరోసా ఇస్తున్న ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీకి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో కుప్పం, బాపట్ల, పల్నాడు, విజయనగరం లలో 4 కొత్త కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త పరిశోధనలు, నూతన వంగడాల సృష్టించేందుకు భారీగా కేటాయింపు లు జరిపారు. వర్సిటీకి రూ.507.01 కోట్లు నిధులు కేటాయించారు. వర్సిటీలోని డ్రోన్ శిక్షణా సంస్థకు డీజీసీఏ గుర్తింపు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.



బాపట్లలో కృషి విజ్ఞానకేంద్రం

కృషి విజ్ఞాన కేంద్రాన్ని బాపట్లలో ఏర్పాటు చేయడానికి శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 13 మంది సిబ్బందితో ఇది ఏర్పాటు కావడంతో పాటు శాస్త్రవేత్తలు కూడా రైతులకు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండనున్నారు. తద్వారా రైతులు సాగులో సమస్యలతో పాటు మట్టి సారం, వాతావరణ అంచనాలు ఇవన్నీ కూడా సకాలంలో రైతులకు చేరే అవకాశాలు ఉంటాయి.

గుంటూరు, సిటీ, విద్య, బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రకటించిన పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టేలా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడుగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి పలు ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తూ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడుగులపై బడ్జెట్లో ప్రభుత్వం వరాల వర్షం కురిపించడంపై కూడా ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, విద్యాకిట్లు తదితర పథకాల కోసం పెద్దఎత్తున కేటాయింపులపై విద్యావేత్తలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో తరగతి గదుల నిర్మాణం నిలిచిపోగా, వాటి పునః ప్రారంభించడానికి బడ్జెట్ కేటాయింపులు చేయనున్నారు. ప్రధానంగా నాడు నేడు పేరుతో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం, తాగునీటి కోసం కొనుగోలు చేసిన ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్, నూతన భవనాల నిర్మాణం తదితరాలకు నిధులు ఉపయోగించనున్నారు. ఇప్పటికే ఏర్పాటైన డిజిటల్ తరగతుల్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు నిర్వీర్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంక్షేమానికి పెద్దఎత్తున బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

అమరావతికి.. రూ.6 వేల కోట్లు

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాజధాని అభివృద్ధి కోసం కిందటి బడ్జెట్లో కేటాయించిన నిధుల కంటే ఈ బడ్జెట్లో రెట్టింపు కేటాయించింది. రాజధానిపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని మరోమారు ప్రకటించింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై బడ్జెట్లో ప్రస్తావనకు కూడా నోచుకోని రాజధాని అమరావతి, కూటమి ప్రభుత్వ బడ్జెట్లలో అగ్రతాంబూలం అందుకుంది. కిందటి బడ్జెట్లో రూ.3వేల కోట్లు కేటాయించగా ఈసారి అమరావతి కేపిటల్ సిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టుల కింద ఆ మొత్తాన్ని రూ.6 వేల కోట్లకు పెంచింది. ఇప్పటికే ఐకానిక్ టవర్స్‌గా ఉన్న సచివాలయ భవన సముదాయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణ పనులు జోరందుకోనున్నాయి.

ఇప్పటికే ఆ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరింది. అన్నీ సకాలంలో జరిగితే మార్చి 15 నుంచి రాజధాని నిర్మాణ పనులు మరింత జోరందుకోనున్నాయి. 2014- 19ల మధ్య ప్రాధాన్యతను సంతరించుకున్న మెట్రో రైలు ప్రాజెక్టు వైసీపీ హయాంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. తాజా బడ్జెట్లో భారీ కేటాయింపుల నేపథ్యంలో మెట్రో ఆశలకు రెక్కలు వచ్చాయి. అమరావతి నిర్మాణంలో కీలకమైన భూసమీకరణకు బడ్జెట్లో నిధులు కేటాయించారు. తాజాగా రాజధాని పరిధిలోని కీలక రహదారులను జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16కు అనుసంధానించే ప్రక్రియ తెరమీదకి వచ్చింది. కరకట్ట రహదారి విస్తరణ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భూసమీకరణ జరగాల్సి ఉంది. అలాగే గతంలో కొన్ని గ్రామాల్లో రైతులు రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. ఇప్పుడు వారంతా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. ఇలా భూసమీకరణ (మిగతా 6వ పేజీలో)

కృష్ణా డెల్టాలో సాగునీటి ప్రాజెక్టులను పురోగతిలోకి తీసుకొచ్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు

కృష్ణా డెల్టాకు రూ.400 కోట్లు

జరిపింది. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపునకు రూ.100 కోట్లు కేటాయించే అవకాశం ఉంది. దీంతో కొన్నేళ్లుగా కాగితాల్లోనే ఉన్న గుంటూరు ఛానల్ పనులు పట్టాలెక్కుతాయి. ఈ ప్రాజెక్టు కూడా గత టీడీపీ హయాంలోనే రూపుదిద్దుకొన్నది. ఛానల్ పొడిగింపు కోసం కొన్ని దశాబ్దాలుగా పెదనందిపాడు ప్రాంత రైతులు పోరాటాలు జరుపుతున్నారు. దాంతో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఈ ప్రాజెక్టుని మంజూరు చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి టెండర్లను రద్దు చేసింది. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామంటూ వైసీపీ ఐదేళ్ల కాలయాపన చేసింది. గత ఏడాది వరదల సమయంలో గుంటూరు ఛానల్‌కి గండ్లు పడటం వల్ల చాలారోజుల పాటు పొలాలు నీట మునిగాయి. దాంతో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీ నుంచి ఒక బృందాన్ని రప్పించి ఇక్కడ అధ్యయనం చేయించారు. నిధుల కోసం ప్రతిపాదనలు కూడా పంపించారు. ఇప్పుడు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై ఆయన, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బూర్ల రామాంజనేయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఛానల్

రీసర్వేను వేగవంతం చేయాలి

- రమణాయపాలెంలో కలెక్టర్ వెంకటమురళి

పర్చూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) భూముల రీ సర్వేని వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పర్చూరు మండల పరిధిలోని రమణాయపాలెంలో శుక్రవారం నిర్వహించిన భూముల రీసర్వేను రైతు సమక్షంలో కలెక్టర్ స్వయంగా పరిశీలించి సమస్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద భూముల రీసర్వేకి ఎంపిక చేసిన గ్రామాల్లో కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలన్నారు. రీసర్వే చేపట్టే ముందు రైతులకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్యను ఆదేశించారు. గ్రామంలో 5,120 మంది రైతులకి సంబంధించి 6,227 ఎకరాల భూమి రీ సర్వే చేస్తున్నారన్నారు. బాపట్ల, పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో 13వ కిలోమీటర్ వద్ద రోడ్డు మరమ్మతులకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పొగాకు రైతుల మొర

తాము పండించిన పంటకు గిట్టుబాటు ధరలేదని, కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదని రమణాయపాలెంలోని వైట్ బర్లీ పొగాకు రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. గత ఏడాది క్వింటా రూ.12 వేలు ఉంటే ప్రస్తుతం రూ.4 వేలు మాత్రమే ధర పలుకుందని వాపోయారు. ఇలా అయితే తాము పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీసీ ప్రతినిధులతో మాట్లాడి పొగాకు కొనుగోలుకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్వేశాఖ ఏడీ ప్రసాదరావు, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.




అధికారుల సమక్షంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

రెవెన్యూ సవరణలు

భూ సమస్యల దిద్దుబాటుపై దృష్టి

- వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు
- మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- ఒక్కో గ్రామం ప్రాతిపదికగా సమస్యలకు వినూత్నంగా పరిష్కారం
- ఇప్పటి వరకు వేల ఎకరాలకు చెందిన 5800 మంది రైతులకు ఊరట
- రీ సర్వే కంటే ముందే సమస్యలు గాడిన పెట్టే ప్రయత్నంలో అధికారులు
- తెనాలి తరహాలో మిగిలిన మండలాల్లో ప్రయత్నిస్తే చిక్కులు వీడినట్టే



బుర్రిపాలెం గ్రామం ఏరియల్ వ్యూ

తెనాలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకరి భూమి మరొకరి ఖాతాలోకి మారిపోతే.. దశాబ్దాలుగా హక్కు కల్గిన భూమి నిషేధిత జాబితాలోకి వెళ్లిపోతే.. భూమి, పత్రాలు సక్రమంగానే ఉన్నా రికార్డులు మార్చేస్తే.. ఇలా ఒకటి.. రెండు కాదు. వందల్లో సమస్యలతో వేలల్లో రైతులు ప్రతీ గ్రామంలోనూ అల్లాడిపోతున్నారు. ప్రతి గ్రామంలోనూ 90 శాతానికిపైగా రైతుల భూముల చరిత్రే మారిపోయి ఎటూపాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. చేసిన తప్పును చక్కదిద్దే చర్యలే లేకపోగా, రైతులను నానా అవస్థలకు గురిచేస్తున్నారు. పైగా వారు చేసిన తప్పు సరిచేయడానికి రైతుల నుంచే రూ.లక్షల్లో లంచాలు దండుకుంటున్న దారుణాలున్నాయి. అయితే తెనాలిలో దీనికి పూర్తిభిన్నంగా ఓ అధికారి విధులు సక్రమంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందనేందుకు ఉదాహరణగా నిలిచారు. సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఊహించని పెద్ద ఊరటే ఇస్తున్నారు. మా వల్ల జరిగిన పొరపాటును మేమే సరిచేస్తామని, అర్జీ కూడా అవసరం లేకుండా, కార్యాలయానికి రానవసరం లేకుండా భూమికి సంబంధించిన ప్రతి పొరపాటును చక్కదిద్దే కార్యక్రమం చేపట్టారు. మిగిలిన అధికారులకు ఆదర్శంగా నిలిచారు.

రీ సర్వే లోపే చక్కదిద్దేలా..

వైసీపీ హయాంలో జరిగిన రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, తాజాగా జరుగుతున్న రీ సర్వేకు ముందే సరిచెయ్యాలనే లక్ష్యాన్ని తెనాలి అధికారులు పెట్టుకున్నారు. దీనికోసం ఒక్కో గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుని సవరణలకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో కొందరు నేతలు రైతుల భూములను కొట్టేసేందుకు రీ సర్వేను అవకాశంగా చేసుకున్నారు. నేరుగా పొలాలకు వెళ్లి పరిశీలించాల్సిన సిబ్బంది ఎక్కడో ఉండి ఆ భూముల యాజమాన్య హక్కులను తిరగరాశారు. దీంతో తమ భూమిని అమ్ముకునేందుకు సిద్ధపడిన రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో క్రొరీలు చూపడంతో అడ్డుకట్ట పడుతూ వచ్చింది. అసలు పొరపాటు ఎక్కడ జరిగిందనే విషయాన్ని తెలుసుకునేందుకు కూడా ఒక్క అధికారి శ్రద్ధ చూపలేదు. తమ భూముల పరిస్థితి పరిశీలించి అన్ని పత్రాలను చూపించినా అధికారుల్లో గత ప్రభుత్వ కాలంలో చలనమే లేకుండాపోయింది.

తెనాలి తహసీల్దారు దృష్టి

కూటమి ప్రభుత్వం వచ్చాక తెనాలి తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ గత రీసర్వేలో జరిగిన తప్పులపై దృష్టిపెట్టారు. భూ స్వభావం, పేరు వంటి వివరాలు నమోదు కావాల్సిన కాలం 6లో జరిగిన లోపాలతో భూముల అమ్మకాలు జరగక అవస్థలు పడుతున్న రైతులు నేరుగా సీఎం చంద్రబాబు దగ్గరకే వెళ్లి మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలో వీటిని వెంటనే సరిచెయ్యాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రెవెన్యూ సిబ్బంది దీనిపై కసరత్తు చేసి, 5800 మంది రైతులకు సంబంధించి వేల ఎకరాల సమస్యకు పరిష్కారం చూపారు. అయితే ఇదొక్కటే కాకుండా, భూములకు సంబంధించి అనేక లోపాలు (మిగతా 6వ పేజీలో)

జన్యుమార్పిడి ద్వారా పంటల అభివృద్ధి


సమావేశంలో ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అధికారులు, పరిశోధనా సంచాలకులు

లాంఫాం(తాడికొండ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న జనాభాకు ఆహారాన్ని సమపాళ్లలో అందించాలంటే జన్యుమార్పిడి ద్వారా పంటలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ కన్సార్టియం ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా జన్యుమార్పిడి ద్వారా పంటల అభివృద్ధి అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బయోటెక్నాలజీ ద్వారా తెగుళ్లను తట్టుకునే వంగడాలను ఆవిష్కరించాలని సూచించారు. బయోటెక్నాలజీ రంగంలో ప్రగతిని సాధించాలంటే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం, నాలెడ్జ్ షేరింగ్ వర్క్‌షాపులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. బయోసీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పరేష్ వర్మ మాట్లాడుతూ పంటల ఉత్పాదకతను జన్యుమార్పిడి రకాలు ఏవిధంగా సుస్థిరంగా ఉంచుతాయని అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా సలహాదారులు, ఏజీవీఏవైపై సహ వ్యవస్థాపకుడు రామ్ కౌండిన్య మాట్లాడుతూ వ్యవసాయ సమస్యలను పరిష్కరించేందుకు బయోటెక్నాలజీ కీలకమన్నారు. వర్కుషాపులో జీనోమ్ ఎడిటింగ్, పురుగు, వ్యాధి నిరోధకత, నేలసారం, చిన్న రైతులకు బయోటెక్నాలజీ వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను చర్చించారు. కార్యక్రమంలో బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా, విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యాన్నారాయణ, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎన్.వీ.వీ.ఎస్ దుర్గాప్రసాద్, సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ వైజీ ప్రసాద్, డాక్టర్ రాణిచాప్రా, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రం నూతన మార్గాలను సృష్టిస్తోంది


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సోమశేఖరరెడ్డి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రం మనిషి జీవితాన్ని ప్రతి మూలలో ప్రభావితం చేస్తోందనీ, వైద్యం నుంచి సమాచార సాంకేతికత వరకు, జీవన శైలిలో నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు శాస్త్రం నూతన మార్గాలను సృష్టిస్తోందని హైదరాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ మెటీరియల్స్ టెస్టింగ్ గ్రూప్ హెడ్, సైంటిస్ట్ కె.సోమశేఖర్ రెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్, మార్స్ మిషన్, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వంటి ప్రయోగాలతో మానవ జాతి కొత్త ప్రపంచాలను అన్వేషిస్తోందన్నారు. జెనోమిక్స్, రోబోటిక్ సర్జరీ, కృత్రిమ అవయవాలు, వ్యాక్సిన్లు, నూతన మందుల అభివృద్ధితో జీవన కాలం పెరుగుతోందని వెల్లడించారు. అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేస్తారా.. వేరొకరిని పెట్టుకోమంటారా?

- విద్యుత్ మీటర్ రీడర్లకు వేతనం చెల్లించకుండా ప్రైవేటు ఏజెన్సీ షాక్
- గతంలో కంటే తక్కువ చెల్లిస్తామంటూ షరతులు
- ఆందోళన బాటలో రీడర్లు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'చేస్తారా.. వేరొకరిని పెట్టుకోమంటారా?' అంటూ విద్యుత్ మీటర్ రీడర్లకు వేతనం చెల్లించకుండా ప్రైవేటు ఏజెన్సీ షాక్ ఇచ్చింది. దీంతో విద్యుత్ మీటర్ల బిల్లులకు రీడింగ్ తీసే రీడర్లు ఆందోళన బాటకు సిద్ధమయ్యారు. నెల నెలా రీడింగ్ తీసే వారికి వేతనాల చెల్లింపులో కొత్తగా వచ్చిన ప్రైవేటు ఏజెన్సీలు అన్యాయం చేస్తున్నాయంటూ నిరసన తెలుపుతున్నారు. ఇప్పటికే రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా తమను ఇబ్బందులు పెడుతున్నారనీ, మార్చి నెల నుంచి మీటర్ల బిల్లింగ్‌నకు రీడింగ్‌లు తీసేదిలేదంటూ వారు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో విస్తరించిన ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో 1200 మంది పైనే విద్యుత్ మీటర్ల బిల్లులకు రీడింగ్ తీసేలా రీడర్లు పనిచేస్తున్నారు. వారంతా రీడింగ్ తీసేందుకు కాంట్రాక్టు పొందిన ఏజెన్సీల పరిధిలో పనిచేస్తుంటారు. అయితే గతేడాది వరకు నిబంధనల మేరకు ప్రతి విద్యుత్ మీటర్‌కు రీడింగ్ తీసినందుకు వారికి రూ.3.62 చెల్లించే వారని తెలిపారు. వారికి బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించటంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ కూడా చెల్లించేవారు. ఒక రీడర్ 3 వేల నుంచి ఆపైనే విద్యుత్ మీటర్లకు రీడింగ్ తీసి వినియోగదారులకు బిల్లులు అందజేసేవారు. ప్రతి నెలలో ఒకటో తేదీ నుంచి 11వ తేదీ లేదా 13వ తేదీ లోపు రీడింగ్ తీసి బిల్లులు ఇచ్చే ప్రక్రియ పూర్తి చేస్తుంటారు. ఇందులో కొందరు ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, కొన్ని మీటర్లకు బిల్లింగ్‌లు జంపింగ్‌లు, మీటర్లు కాలిపోవటం వంటి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అవన్నింటిని వీరే అధికారుల దృష్టికి తీసుకెళుతుంటారు. ఇలా చేస్తే నెలకు వారికి మొత్తంగా దాదాపుగా రూ. 11 వేలు జమ అవుతుంటాయి. ఇటీవల జనవరి నుంచి కొత్తగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు గతంలో రీడింగ్‌కు మీటర్‌కు రూ. 3.62 పైసలు చెల్లించ లేమని, మీటర్‌కు రూ. 3.20 మాత్రమే చెల్లిస్తామని వారికి షాకిచ్చారు. సంస్థ నిబంధనల మేరకు టెండర్ దక్కించుకొని తీరా మీటర్ రీడర్లకు అన్యాయం చేస్తే ఎలా అని స్పాట్ బిల్లింగ్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా తగ్గించిన దాంతో ఒక్కో రీడర్‌కు మొత్తంగా వేతనంలో రూ.1200 నుంచి రూ.1500 వరకు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జనవరి నెల వేతనాలను జమ చేయలేదనీ, ఫిబ్రవరి నెలవి కూడా చెల్లింపు ప్రక్రియ చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మీటర్ రీడింగ్ నిలిపివేతకు సిద్ధం

సంస్థ నుంచి కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీ వారు మీటర్ బిల్లింగ్ రీడర్లకు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేయటం సరికాదని మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు నిరసనగా మార్చి నుంచి బిల్లుల రీడింగ్ నిలిపివేస్తామని అసోసియేషన్ గుంటూరు టౌన్-1 డివిజన్ కార్యదర్శి ఏవీఏ సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు ఇప్పటికే తమ సమస్యను ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు

- భూసేకరణకు రూ.100 కోట్లు, విస్తరణకు రూ.300 కోట్లు
- కేంద్ర మంత్రి పెమ్మసాని


సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, ఎమ్మెల్యేలు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 2024-25 రాష్ట్ర బడ్జెట్లో గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయించడం హర్షణీయమని గ్రామీణ అభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బడ్జెట్ కేటాయింపులపై గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. గుంటూరు పార్లమెంట్లో 50 ఏళ్ల కల అయిన గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ కోసం టీడీపీ ప్రభుత్వం 2014 - 19 కాలంలోనే బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించిందనీ, దాన్ని వైసీపీ నిర్వీర్యం చేయగా, తిరిగి అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో మరిన్ని వివరాలు సేకరించి, నూతనంగా డీపీఆర్‌లు తయారు చేయించి, నిధులు కేటాయింపజేయడంలో విజయవంతం అయ్యామని చెప్పారు. 441 ఎకరాల భూసేకరణకు రూ.100 కోట్లు, విస్తరణకు రూ.300 కోట్ల కేటాయించడం హర్షణీయం అన్నారు. ఛానల్ ఆధునికీకరణకు మరో రూ.650 కోట్లకు ప్రతిపాదనలు పెడుతున్నామని, రాబోయే ఎన్నికల్లోపు ఆ విస్తరణతో పాటు ఆధునికీకరణ పనులు కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి 1200 క్యూసెక్కులను తీసుకు రాగలిగామన్నారు. సహకరించిన మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తాను కేంద్ర ప్రభుత్వంలో ఉండడంవల్ల రూరల్ ల్యాండ్ రికార్డులను, అర్బన్ ల్యాండ్ రికార్డులను డిజిటలైజ్ చేయడం కోసం రూ. 400 కోట్ల ఇన్సెంటివ్ అందించగలిగామన్నారు.

గోవాడ తిరునాళ్లలో కొనసాగుతున్న రద్దీ


ప్రత్యేక అలంకరణలో బాలకోటేశ్వర స్వామి

అమృతలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం మండలంలోని గోవాడ బాలకోటేశ్వర స్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. స్వామివారికి అభిషేకాలు చేయించుకునేందుకు ఉదయం వేళ భక్తులు బారులు తీరారు. ధ్వజస్తంభం వద్ద టెంకాయలు కొట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి దర్శించుకునేందుకు భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో అధిక సంఖ్యలో మహిళలు గృహోపకరణాలు, చెక్క సామగ్రి కొనుగోలుపై ఆసక్తి చూపించారు. చెక్క సామగ్రికి మంచి పేరుగాంచిన తిరునాళ్ల గోవాడ. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ తిరునాళ్ల 5 రోజుల పాటు కొనసాగడం విశేషం. శనివారం ఆలయ హుండీ లెక్కింపుతో ఉత్సవాలు ముగుస్తాయని, ప్రస్తుత ఆదాయం రూ.37 లక్షలని ఈవో అశోక్‌కుమార్ తెలిపారు.

రెవెన్యూ సవరణలు

(5వ పేజీ తరువాయి)

ఉండటంతో వాటి దిద్దుబాటు చేపట్టారు.

అర్జీ అవసరం లేకుండా.. రైతులను తిప్పుకోకుండా..

గడచిన శతాబ్దకాలంగా పదిలంగా ఉన్న ఎందరో భూముల హక్కులు ఒక్క సంవత్సరంలో మారిపోయాయి. ఉదాహరణకు పొన్నూరు పట్టణ పరిధిలో 220 ఎకరాల భూమి కేవలం ఐదుగురు వ్యక్తుల పేరుపై నమోదు చేయడం తెలిసిందే. ఇదే తీరులో ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో పేర్ల మార్పులు జరిగాయి. పొన్నూరులో జరిగిన లోపాలను నేటికీ సరిచేస్తూనే ఉన్నారు. అయితే తెనాలిలో మాత్రం రైతు దరఖాస్తు చేసుకోవడం, కార్యాలయం చుట్టూ తిరగడం, లంచాల రూపంలో చదివించుకోవడం వంటివి లేకుండానే తప్పులు సరిచేస్తున్నారు. ఇప్పటికే సంగంజాగర్లమూడి, కొవెవరం, నందివెలుగు, గుడివాడ, మల్లెపాడు, దేవరపల్లి అగ్రహారం వంటి గ్రామాల్లో రికార్డులను సరిచేశారు. ప్రస్తుతం బుర్రిపాలెం గ్రామాన్ని ఎంపిక చేసుకున్నారు. 291 సర్వే నంబర్లలో మొత్తం 1732 ఎకరాల భూమి ఉంటే యాజమాన్య హక్కులు మారినవి, లెగసీ కేసుల వంటివి ఎక్కువ గుర్తించారు. ఈ గ్రామంలో ఇటీవల రెవెన్యూ సదస్సు పెడితే అధికారులకు భూమి సమస్యలకు సంబంధించి అందిన దరఖాస్తులు కేవలం 2 మాత్రమే. అయితే ఇక్కడ సమస్యలు మాత్రం 100కుపైనే ఉన్నాయి. అంటే ఇద్దరికి మినహా మిగిలిన రైతులకు వారి భూమికి సంబంధించి సమస్య ఉందనే విషయం కూడా తెలియదు. అయితే ఈ మొత్తాన్ని పరిష్కరించి, వాటిని సరి చెయ్యాలని అధికారులు నిర్ణయించారు.

విస్తు కలిగించే విషయాలెన్నో!

- బుర్రిపాలెంలో జగనన్న కాలనీ కోసం మూడేళ్ల క్రితం 198.22 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇంకా రైతుల పేరుపైనే భూమి ఉంది. ప్రభుత్వ భూమిగా మార్చాల్సిన భూమినీ అధికారులు మార్చలేదంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతుంది.
- 9999, 99999 ఖాతా నంబర్లలో 196 సర్వే నంబర్లను చేర్చారు. భూ విస్తీర్ణం 460 ఎకరాలపైనే. అయితే ఈ విషయం రైతులకు తెలియదు. దీనిని అధికారులే గుర్తించారు.
- రైతుల పేరు బదులు '0' అని నమోదు చేశారు. దీనివల్ల రైతు తన భూమిని అమ్ముకోడానికి వీలులేని పరిస్థితి.
- లెగసీ కేసులు కూడా చాలానే ఉన్నాయి. ఒక రైతుపేరుపై ఉండాల్సిన వాస్తవ విస్తీర్ణం కాకుండా దానికి మించి కానీ, తక్కువగా కానీ చూపడం, వాటిని మరొకరి పేరుకు చేర్చడం వంటి వాటిని గుర్తించారు.
- 80కిపైగా సర్వే నంబర్లలో అసలు రైతు పేరు కాకుండా ఇతరుల పేర్లు నమోదు చేశారు. రైతు పేరుపై పట్టా, ఇతర హక్కు పత్రాలన్నీ కచ్చితంగా ఉన్నా, వాటిని గతంలో సరిచేసిందేలేదు.
- గ్రామంలో 291 సర్వే నంబర్లుంటే, వీటిలో 60 ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు. అవి ఏ రైతులకు సంబంధించినవో అంతుబట్టని విషయం.

సమస్యలన్నీ పరిష్కరించేలా



ఇకపై ఏ రైతూ అంతుబట్టని చిక్కులతో హక్కుల కోసం పోరాడాల్సిన అవసరంలేదు. గతంలో మా వల్ల జరిగిన భూముల తప్పులు మేమే సరిదిద్దాలని నిర్ణయించుకున్నాం. రీ సర్వేలో లోపాలు మళ్లీ కనిపించకుండా, రైతులకు ఏ ఇబ్బంది లేకుండా పరిష్కారం చూపదలిచాం. ఏ ఒక్క రైతు నుంచి భూ సమస్యలపై అర్జీ రాకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకుని మోడల్‌గా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. మా ప్రయత్నానికి జేసీ, సబ్ కలెక్టర్ పూర్తి సహకారం అందిస్తున్నారు. తప్పులను సరిదిద్దేందుకు ఏ రైతూ లంచం ఇవ్వాల్సిన అవసరంలేదు.

\- గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి

అమరావతికి అగ్రతాంబూలం

(5వ పేజీ తరువాయి)

అవసరాల నిమిత్తం తాజాగా బడ్జెట్లో మరో 297.82 కోట్లు కేటాయించారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్

నేతన్నలు, నాయీబ్రాహ్మణులకు విద్యుత్ భారం తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నట్లుగానే నేతన్నలకు, నాయీ బ్రాహ్మణులకు ఉచితంగా విద్యుత్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం అందుబాటులోకి వస్తే గుంటూరు జిల్లాలో 10 వేలు, బాపట్ల జిల్లాలో 17 వేలు, పల్నాడు జిల్లాలో 3 వేల చేనేత కుటుంబాలకు భారీ ఊరట లభించనుంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన ఆదరణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా, తాజాగా ఆ పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం పునరుద్ధరిస్తే నాయీబ్రాహ్మణ, రజక, చేనేత, కల్లుగీత కార్మికులు, కుమ్మరి, కమ్మరి ఇతర కుల, చేతి వృత్తులవారికి వృత్తిపరమైన భరోసా లభించే అవకాశం ఉందనడంలో సదేహం లేదు.

దీపం- 2 14 లక్షల మందికి లబ్ధి

దీపం- 2 పథకాన్ని ఇప్పటికే ప్రారంభించిన ప్రభుత్వం గత బడ్జెట్లో ఒక సిలిండరును లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేసింది. తాజా బడ్జెట్లో ఈ పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించడంతో ఈ ఏడాది మూడు గ్యాసు సిలిండర్లు ఉచితంగా అందనున్నాయి. మూడు జిల్లాల్లోని 14 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ఏడాది రూ.357 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

అవ్వాతాతల కళ్లలో ఆనందం

అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు చేయూతనిచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు భారీగా నిధులు కేటాయించారు. సూపర్ సిక్సులో హామీల్లో కీలకమైన హామీని అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచిన ప్రభుత్వం బడ్జెట్లోనూ అదే ప్రాథాన్యాన్ని కల్పించింది. బడ్జెట్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 7లక్షల 40వేల మంది లబ్ధిదారులకు రూ.3,880 కోట్లు కేటాయించింది. బడ్జెట్లోనే కేటాయింపులతో ఏడాది పాటు అవ్వాతాతల పింఛనుకు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది.

స్వర్ణాంధ్ర సాధనకు బలమైన బడ్జెట్


బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు బలమైన పునాదిగా రాష్ట్ర బడ్జెట్ నిలిచిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, దానికి పరిష్కారాలు చూపగల ముఖ్యమంత్రి చంద్రబాబు సామర్థ్యాలకు ఇది నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రూ.3,22,359 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు, అన్ని వర్గాలకు అండగా నిలిచే ప్రయత్నం చేశారని హర్షం వ్యక్తం చేశారు. అప్పులు, వడ్డీలకే రూ. 60 వేల కోట్లు కట్టాల్సి వస్తున్న తరుణంలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం రూ.75 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలు చేసేందుకు రూ.9,407కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6 వేల 30 కోట్లు ఇవ్వడాన్ని సూపర్‌సిక్స్ పథకాల అమలులో తిరుగులేని ముందడుగుగా ఆయన పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ పెన్షన్లకు రూ.27,518 కోట్లు కేటాయించడం ద్వారా వృద్ధులు, దివ్యాంగులతో సహా లబ్ధిదారులందరికీ భరోసా ఇచ్చారన్నారు. పోలవరానికి రూ.6,705 కోట్లు, అమరావతికి రూ. 6 వేల కోట్లు కేటాయించడం ద్వారా వాటి నిర్మాణంపై పూర్తి విశ్వాసం కలిగించిందని తెలిపారు. విద్యా రంగానికి దాదాపుగా రూ.40 వేల కోట్లు కేటాయింపుతో పెద్దపీట వేయడం అభినందనీయం అన్నారు. కేంద్రం అండతో భారీగా నిధులు వచ్చే అవకాశం ఉందనీ, వ్యవసాయం నుంచి ప్రజారోగ్యం వరకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందన్నారు.

పది పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు పకడ్బందీగా, పారదర్శకంగా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అన్నారు. డీఈవో సి.వి. రేణుక మాట్లాడుతూ జిల్లాలో 150 పరీక్షా కేంద్రాలలో 30,460 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు పరీక్షల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలనీ, ఇన్విజిలేటర్లు ఎటువంటి పొరపాట్లు చేయకుండా ఒక రోజు ముందుగానే ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్షలు రాయకూడదనీ, అందరికీ ఫర్నిచర్, మంచి నీరు, విద్యుత్ వసతులు కల్పించాలని సూచించారు. ఈ విషయంలో ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, కె.వెంకటరెడ్డి, ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి టి.తిరుమలేష్, ఉప విద్యాశాఖాధికారులు ఏసురత్నం, శాంత కుమారి, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

14న పిఠాపురం సభకు భారీగా తరలిరావాలి

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో మార్చి 14న జరిగే రాష్ట్ర జనసేన పార్టీ ఆవిర్భావ సభకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తరలిరావాలని రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో, పిఠాపురం సభను విజయవంతం చేసేందుకు గుంటూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న జిల్లా కమిటీ, పట్టణ, మండల, వార్డు అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నాయకులు స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని సభకు తమ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాసరావు, నిమ్మల రమణ, ఐశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఐసీఐసీఐ కుంభకోణంలో కీలక నిందితుడి అరెస్టు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసులో ముఖ్య నిందితుడు సింగు అజిత్ కుమార్‌ను గుంటూరు సీఐడీ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన బ్యాంకు మేనేజర్ నరేష్‌తో కలిసి అజిత్ కుమార్ అక్రమ నగదు లావాదేవీలలో కీలకంగా వ్యవహరించాడు. సుమారు రూ.35 కోట్లు అజిత్ కుమార్ ఖాతాకు బదిలీ అయినట్టు సీఐడీ పోలీసులు గుర్తించారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో అజిత్ కుమార్‌ను సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య అరెస్టు చేసి విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం అతడిని నెల్లూరు జైలుకు తరలించారు. ఈ కేసులో మొత్తం 20 మంది నిందితులు ఉన్నారు. ఇప్పటికి సీఐడీ పోలీసులు 7 గురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన బ్యాంకు మేనేజర్ నరేష్ కోర్టులో లొంగిపోయారు. నరేష్ ప్రస్తుతం నెల్లూరు జైల్లో ఉన్నాడు. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచ్‌లలో మొత్తం రూ. 70 కోట్ల మేరకు కుంభకోణం జరిగింది.

పోలీసుల అదుపులో నకిలీ కార్మిక శాఖ అధికారి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ అధికారిని అని చెబుతూ షాపుల వద్ద లైసెన్స్ రెన్యువల్ ఫీజులు వసూలు చేస్తున్న నకిలీ కార్మిక శాఖ అధికారిని శుక్రవారం రాత్రి బస్టాండ్ వద్ద గల షాపుల నిర్వాహకులు పట్టుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. ముప్పాళ్లకు చెందిన కె.వెంకయ్య పట్టణంలో తాను కార్మిక శాఖ అధికారిని అని, షాపుల లైసెన్స్‌లు రెన్యువల్ చేయాలని బస్టాండ్‌లోని కొన్ని షాపుల నిర్వాహకుల వద్ద గురు, శుక్రవారాల్లో ఒక్కొక్క షాపునకు రూ.700 నుంచి రూ. వెయ్యి వరకు వసూలు చేశాడు. కొన్ని షాపులకు లైసెన్స్ రెన్యువల్ ఫీజు సచివాలయాల్లో చెల్లించి సర్టిఫికెట్లు అందించాడు. ఈ విషయం సత్తెనపల్లి కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ ఎల్ శ్రీనివాస్ దృష్టికి రావటంతో ఆయన వెంటనే షాపుల నిర్వాహకుల సహకారంతో నకిలీ కార్మిక శాఖ ఉద్యోగిని పట్టుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. కార్మిక శాఖ అధికారి పేరిట సత్తెనపల్లిలో షాపుల వారి వద్దకు వెళ్లి లైసెన్స్ రెన్యువల్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్న వెంకయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నట్టు సీఐ బ్రహ్మయ్య తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87. 99. 108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

1,11,037 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 96,128 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,11,037 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,790 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13900
నంబరు. 5	10500	14500
273	10000	13000
341	10000	14500
4884	10700	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14100

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11500	13000
బ్యాడిగి 355	10000	14000
సింజెంటా		
బ్యాడిగి 5531	10000	12500
ఎస్ఎస్ 250		
బుల్లెట్	--	--
దేవనూరు డీలక్స్	10000	13500
ఆర్మూరు	10000	11500
తాలుకాయలు	5000	7500

ప్రజలలో సైన్స్ దృక్పథం పెరగాలి

● సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీ బ్రహ్మం

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలలో అన్ని విషయాలలో సైన్స్ దృక్పథం పెరగాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీ బ్రహ్మం తెలిపారు. 38వ జనవిజ్ఞానవేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాపట్ల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఫోరం ఫర్ బెటర్, బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం అవసరమన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక నాయకులు కోట వెంకటేశ్వర్లురెడ్డి, జీవీ సుబ్రహ్మణ్యం, సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, డి.భాస్కర్, నాళం సూర్యనారాయణ, గుప్తా, రామనారాయణరావు, ఇ.సుబ్బారావు, బి.వెంకటేశ్వర్లు, రామరాజు, కాళీదాసు, వెంకయ్య, ప్రసాద్, సుభానీ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

చుండూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా చుండూరులోని శ్రీబాలకోటేశ్వరస్వామి దేవాలయానికి హుండీ ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2.90 లక్షలు లభించిందని సీఎఫ్‌వో నాగమల్లేశ్వరి తెలిపారు. గ్రామస్థులు, భక్తులు, వివిధ శాఖల ఉద్యోగుల సహాయ సహకారాలతో తిరునాళ్ల ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

కర్లపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికకావటం అభినందనీయమని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రీడాజట్టును ఎంపిడివో అభినందించారు. ఎంపికైన క్రీడాకారులకు ఎంపీడీవో చేతులమీదగా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా టైలర్స్‌డే వేడుకలు

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రగతి టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ అల్లాభక్షి మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన టైలర్‌లకు పెన్షన్ సౌకర్యం, విద్యుత్ సబ్సిడీ, టైలరింగ్ మెటీరియల్ సబ్సిడీపై ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు అలపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుందరరావు, కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, మోదుగుల భాస్కరరావు, ఎస్‌కే అస్మత్ వలి, మౌలాసాహెబ్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం కుట్టుమిషన్ సృష్టికర్త విలియన్ ఎల్లాస్ హోవే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్జీల అసోసియేషన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆయన సృష్టించిన కుట్టుమిషన్ అనేక మంది జీవనోపాధిని కల్పించిందన్నారు. కార్యక్రమంలో భార్గవి, నాగేశ్వరరావు, మహ్మద్ అనీఫ్, సుబ్బారావు, శిరీష, ప్రసాద్ పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దర్జీల దినోత్సవం సందర్భంగా విలియన్ ఎల్లాస్ హోవే చిత్రపటాన్ని చేతబూని కర్లపాలెంలో శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా సీనియర్ దర్జీలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సివి.రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో 5, 3వ తరగతి విద్యార్థులకు ప్రతిభాపరీక్షలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈపోటీలను ఎంఈవో ఎస్.నిరంజన్ ప్రారంభించారు. ఉపాధ్యాయుల సహకారంతో గత 11 సంవత్సరాలుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయుడు వై.నాగవర్ధనరావు తెలిపారు. ప్రతిభ చూపిన రెల్లికాలనీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని హర్షవర్ధిని, ద్వితీయ బహుమతి జయప్రమీద, తృతీయ బహుమతి మహమ్మద్ ఆయాన్‌లకు సైకిల్, స్మార్ట్‌వాచ్‌లను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, జిల్లా సైన్స్‌అధికారి ఎండి.సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

తైవాన్ జామ మొక్కలు పంపిణీ

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన మోడల్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. ప్రాజెక్టులు తయారుచేసిన విద్యార్థులందరికి బయోలజి ఉపాధ్యాయులు డి.విక్టోరియమ్మ సౌజన్యంతో తైవాన్ జామ మొక్కలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లూరులో బాపట్ల ఇంజనీరు మృతి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంజనీరు ఫుల్లుగా మద్యం సేవించి, మూడు ప్యాకెట్ల సిగరెట్లు తాగి, మటన్ బిరియాని తింటూ మరణించాడు. సీఐ కథనం మేరకు బాపట్ల సూర్యలంక రోడ్డుకు చెందిన చాపల రఘురామ్ (40) నెల్లూరు జిల్లాలోని అమేజింగ్ కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్నాడు. ధనలక్ష్మీపురం కేజీకే కల్యాణ మండపం అనుబంధ కల్పన రెసిడెన్సీలో గది అద్దెకు తీసుకుని సహచర ఉద్యోగి భగవాన్‌తో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి కుర్చీలో కూర్చుని ఒక హాఫ్, రెండు క్వార్టర్ బాటిళ్ల మందు తాగాడు. మూడు ప్యాకెట్ల సిగిరెట్లు కాల్చాడు. మటన్ బిరియానీ ఆర్డర్ చేసి తెప్పించుకుని తింటూ అదే కుర్చీలో వెనుకకు వాలి ప్రాణాలు కోల్పోయాడు. రఘురామ్ అవివాహితుడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గుంజి వేణు తెలిపారు.

విజ్ఞానశాస్త్రంపై విద్యార్థులు ఆసక్తి కలిగి ఉండాలి

● ఉప విద్యాశాఖాధికారి కె.సురేష్‌కుమార్



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపవిద్యాశాఖాధికారి కె.సురేష్‌కుమార్, ఎంఈవోలు నిరంజన్, ప్రసాద్ తదితరులు

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్నతనం నుంచి విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి కలిగియుండాలని ఉపవిద్యాశాఖాధికారి కె.సురేష్‌కుమార్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉపవిద్యాశాఖాధికారి మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే వస్తువులను, విషయాలను కనుగొనేందుకు తమ జీవితాలను దార పోసిన శాస్త్రవేత్తలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం క్విజ్ పోటీలలో మొదటి బహుమతి సాధించిన బి.బాల యశ్వంత్‌కుమార్, పి.దేవేంద్ర, ద్వితీయ బహుమతి సాధించిన జె.ప్రమీద, డి.లీలా సుప్రియ, తృతీయ బహుమతి సాధించిన ఎన్.హేమ దీక్ష, టి.జెస్విన్ సుబ్బరాయుడులకు బహుమతులు ప్రదానం చేశారు. హైస్కూల్ స్థాయి విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన బి.జ్ఞానతేజస్వి, కె.యశ్వంతి, ద్వితీయ బహుమతి సాధించిన షేక్ జాన్, మహిధరహసన్, తృతీయ బహుమతి సాధించిన ఎ.సుస్మిత, ఎస్.యాస్మిన్‌లకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.నిరంజన్, ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాధిక్ పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో...

బాపట్ల పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు వాటర్‌సైకిల్, సోలార్ సిస్టమ్,హ్యూమన్‌బాడీ సిస్టమ్, లంగ్స్ వర్కింగ్, హైడ్రాలిక్ లిఫ్ట్, డ్రోన్ సిస్టమ్ వంటి మోడల్స్ ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనను ప్రిన్సిపాల్ భాగ్యరాణి, వైస్ ప్రిన్సిపాల్ ఇ.లక్ష్మీ, ఉపాధ్యాయులు లక్ష్మీ తిరుపతమ్మ, షారోను, ప్రసన్న, భవానీ, ఏవో సాంబశివరావు తదితరులు పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

చైతన్యస్కూల్‌లో...

బాపట్ల పట్టణంలోని భీమావారిపాలెంలో గల శ్రీ చైతన్య స్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్దార్థ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి చూపాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో విద్యార్థులు అనేక మోడల్స్‌ను ఉంచారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయమాధురి, ఏజీఎం అంజయ్య, అప్పాజీ, విజయకుమార్, రవికుమార్, అనూష, వంశీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హైవెండ్ హైస్కూల్‌లో...

కర్లపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ ప్రాజెక్టులు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎండి సాయిమహేంద్రబాబు, డైరెక్టర్‌లు వెంకటజ్యోతి, ఆంజనేయప్రసాద్, చాంధిని, రఫీ, షర్మిలబేగం, రామలక్ష్మి ఎగ్జిబిషన్‌ను పర్యవేక్షించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యార్థుల సైన్స్‌డే వేడుకలను జరుపుకున్నారు.

రామకృష్ణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో...



సైన్స్‌డే సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కరస్పాండెంట్ అవర్ణ

రేపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి సీవీ రామన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రామకృష్ణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ కె.అవర్ణ అన్నారు. పట్టణంలోని రామకృష్ణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో శుక్రవారం సైన్స్‌డే సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైన్స్‌డే ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు.

ఆటోమ్యాటిక్ స్ట్రీట్‌లైట్స్, అలారం తదితర నమూనాలు ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా సైన్స్ కమ్యూనికేషన్ ఉన్నతస్థితికి చేరుకుంటుందని, విద్యార్థులు దానిపై మక్కువ పెంచుకుని సైన్స్‌లో రాణించాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరం ఎస్వీఆర్ఎం కళాశాలలో...

నగరం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) : భారతదేశానికి విజ్ఞాన శాస్త్రరంగంలో మొదటి సారిగా నోబుల్ బహుమతిని సాధించి పెట్టిన సర్ సీవీ రామన్ సేవలకు గుర్తుగా జాతీయ సైన్స్‌డే జరుపుకుంటామని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలోని భౌతికశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్‌పై విద్యార్థినీ, విద్యార్థులు లోతైన అధ్యయనం చేయాలని, దీని ద్వారా సైన్స్‌పై నూతన ఆవిష్కరణలు వస్తాయన్నారు. నిడుబ్రోలు పిబియన్ భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.శ్రీనివాసరావు వైద్య, పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పుల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ సీవీరామన్ భారతరత్నతో పాటు ఎన్నో పురస్కారాలు అందుకున్నారని కొనియాడారు. కళాశాల అడ్మినేటివ్ డైరెక్టర్ పివి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రామన్ లాంటి శాస్త్రవేత్తలు దేశానికి తయారు కావాలని ఆకాంక్షించారు. అనంతరం చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటనారాయణ, భౌతిక శాస్త్ర అధ్యాపకులు పి.వెంకటేశ్వరరావు, వైవీ సారథి, ఐక్యూఏసీ సమన్వయకర్త ప్రసన్నబాబు, ఎలక్ట్రానిక్ శాఖాధిపతి ఎ.శ్రీదేవి, అమరేష్‌రెడ్డి, ఇతర కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్వీఆర్ఎం కళాశాలలో ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అల్లపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో...

నగరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవటం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుతారని అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యార్లగడ్డ రాజేశ్వరి అన్నారు. జాతీయ సైన్స్‌డే సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఎస్.సీతారామయ్యతో కలిసి ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీపై విద్యార్థులు మరింత లోతైన అధ్యాయనం చేయటం ద్వారా సైన్స్‌పై ఎక్కువ అవగాహన కలుగుతుందన్నారు. కళాశాల అవసరాలకు వినియోగించుకునేందుకు టెంట్, సైడ్‌వాల్స్‌ను కళాశాల సోషల్ ఉపాధ్యాయురాలు గోగినేని రత్నవల్లి ఆమె తల్లిపేరుమీద బహూకరించారని తెలిపారు. ముఖ్యఅతిథి సీతారామయ్య మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ భవిష్యత్తులో ఎంతో ఉపయోపడుతుందని, దానిపై అవగాహన పెంచుకునేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో...

వేమూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమూరు, జంపని, పెరవలి, కుచ్చెళ్లపాడు, చావలి, వరహాపురం ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల చేత వైజ్ఞానిక పరమైన అనేక ప్రదర్శనలు చేశారు. జంపని హైస్కూల్‌లో సైన్స్ విజ్ఞానంపై విద్యార్థులు చిరునాటికలు ప్రదర్శించారు. వేమూరు హైస్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయులు సువర్చలాదేవి, స్వరూపరాణి ఆధ్వర్యంలో విద్యార్థులు అనేక సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



వేమూరు హైస్కూల్‌లో సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్ సమ ప్రాధాన్యం

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ బడ్జెట్‌పై తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ తల్లికి వందనం పథకం అమలుకు బడ్జెట్‌లో 9.407 కోట్ల నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. బీసీల సంక్షేమానికి రూ.47.456 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం మరోసారి బీసీలపై తనకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం 6705 కోట్ల కేటాయించడాన్ని తాను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లు మహిళా శిశు సంక్షేమం కోసం దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిన ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచిందని తెలిపారు. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు అన్ని రంగాల అభివృద్ధికి ముందుచూపుతో నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణాత్మకమైన బడ్జెట్ : వేగేశన



బాపట్ల,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణాత్మకమైన అభివృద్ధిని కాంక్షించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్ జనరంజకంగా ఉందని కొనియాడారు. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు ఈ బడ్జెట్‌లో అద్భుతంగా ఆవిష్కృతమయ్యాయన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అన్నదాతల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా అమ్మకు అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేలా జలవనరుల శాఖకు అధిక కేటాయింపులు చేశారన్నారు. ప్రజామోదయోగ్యమైన బడ్జెట్‌ను అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులకు బాపట్ల నియోజకవర్గం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ అన్నారు.

రాష్ట్ర బడ్జెట్ సమగ్రాభివృద్ధికి దోహదం : యార్లగడ్డ



బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్ సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం, విద్య, ఆరోగ్య రంగాల పటిష్ఠత పై అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. సంక్షేమ పథకాలకు, పారిశ్రామికాభివృద్ధికి సముచిత నిధులు కేటాయించటం ప్రజాసంక్షేమానికి ఊతమిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు జలజీవన్ మిషన్‌కు నిధులు కేటాయించటం సంతోషదాయకమన్నారు. గత ప్రభుత్వం అశ్రద్ధ చేసిన రాజధాని అమరావతికి నిధులు కేటాయింపు హర్షణీయమన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి తదితరులు

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బాలకార్మిక వ్యవస్థకు నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య, కౌమార కార్మిక వ్యవస్థ చట్టం 2016 ప్రకారం 18 సంవత్సరాల వయసు లోపల ఉన్న బాలబాలికలను పనిలో పెట్టుకోరాదన్నారు. అలా ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై బాలకార్మిక చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డీవీ శివప్రసాద్, బాపట్ల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయిజ్యోతి, సీపార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ బడుగు కిషోర్ పాల్గొన్నారు.

పెంచన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడరాదు : కలెక్టర్

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీలో సిబ్బంది అవకతవకలకు పాల్పడకూడదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పలుసూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో సమ్మర్‌స్టోరేజిలు, వాటి పరిస్థితిపై కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిణిని ఆరా తీశారు. మార్చి15వ తేదీలోపు సమ్మర్ స్టోరేజిలను నీటితో నింపి నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలోని 6 నియోజకవర్గాలలో ఎం.ఎస్.ఎంఈ పార్కుల ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో పీఎం కుసుమ కింద సోలార్ పవర్ ప్లంటేషన్ కొరకు సేకరించిన 28 ఎకరాలకు ఆర్డర్ ప్రాతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, సీపీవో శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, గనుల శాఖాధికారి రాజేష్, డీఆర్‌డీఏ పీడీ పద్మ, పౌరసరఫరాల అధికారి ఈబీ విలియమ్స్, డీపీవో ప్రభాకరరావు, డీఎల్‌డీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వం నిర్దేశంచిన పురోగతి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. డీఆర్సీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంపుపై నూరుశాతం లక్ష్యాలు చేరుకుని బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం సాధించటం అభినందనీయమన్నారు. 50,965 ఎకరాల్లో 46వేల మంది రైతులు 15రకాల ఉద్యానపంటల సాగు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలన్నీ 5స్టార్ ర్యాంక్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాబోధనతోపాటు మౌలిక సదుపాయాల కల్పనలో ఫైవ్‌స్టార్ ర్యాంకింగ్‌కు పొందిన పాఠశాలలు జిల్లాలో 150 ఉన్నాయన్నారు. అపార ఐడీ నమోదులో జిల్లా 14వ స్థానంలో నిలిచిందన్నారు. గత సంవత్సరంలో 43.14శాతం మాతృ, 4.31శాతం శిశు మరణాలు నమోదయ్యాయన్నారు. డెంగ్యూ కేసులు నమోదు కాగానే తక్షణమే ఆప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం ప్రజలకు అందేలా వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీవో శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏపీవీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శేషుకుమార్, ఉద్యానశాఖ ఏడీ జెన్నెమ్మ, పరిశ్రమలశాఖ జీఎమ్ రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా బెక్టాగన్-2025 ఉత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు

బాపట్లరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బెక్టాగన్-2025 వేడుకలు అంగరంగవైభవంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్, ఇపీఆర్ డిజిటల్ సప్లై సెక్యూరిటీ అండ్ ప్రైవసి వైస్ ప్రెసిడెంట్ శైలజ వడ్లమూడి పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ముఖ్యఅతిధులచేత బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథిగా మోటుపల్లి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సాంకేతిక విద్యార్థులు అన్నికోణాలలోను కావాల్సిన సమర్థతను పెంపొందించుకోవాలని కోరుతూ టీమ్ వర్క్ ప్రాశస్త్యాన్ని సవివరంగా వివరించారు. మరో అతిథి శైలజ వడ్లమూడి ఆధునిక సాంకేతిక విప్లవంలో సైబర్ సెక్యూరిటి ప్రాధాన్యతను సోదాహరణంగా వివరించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపకరించే విభిన్నమైన విలక్షణ పోటీలను నిర్వహించటం చాలా సంతోషంగా ఉందని ఇవి విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసి వారు ఉన్నతశిఖరాల వైపు పయనించటానికి దోహదపడి విలువైన వజ్రాలుగా మార్చగలవని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ బెక్టాగన్-2025ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ఉపయోగపడే ఎటువంటి కార్యక్రమాలకైనా తమ బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ముందుండి కావాల్సిన సహయసహకారాలను తప్పక అందిస్తుందని తెలిపారు. వివిధ విభాగాలకు సంబంధించి శుక్రవారం జరిగిన అనేక పోటీలలో 1200మందికిపైగా వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త కార్యదర్శి దొడ్డపనేని వెంకయ్య చౌదరి, ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, కొల్లా వీరయ్యచౌదరి, కె.హరిపద్మప్రసాదరావు, బెక్టాగన్ కన్వీనర్ డి.నిరంజన్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సభకు ఇచ్చిన అతిథులను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు దుశ్శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి దేవదత్తు

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా, డ్రగ్స్ వంటివి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి జి.దేవదత్తు హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వర్ణపురం గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ బి.వెంకటేశ్వర్లు, సీఐ పి.గీతిక, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై ఖైదీలు అవగాహన పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్

రేపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఖైదీలుగా మారిన మీరు సత్‌ప్రవర్తనతో నడుచుకుని కుటుంబాలకు అండగా నిలవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, గుంటూరు సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్‌జియావుద్దీన్ అన్నారు. స్థానిక సబ్ జైల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఖైదీలకు ఆహార, వైద్య, లీగల్ ఎయిడెడ్ సౌకర్యాలు, వారి కేసుల వివరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. 70 సంవత్సరాలు పైన వయసు గల ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గుమ్మడి కుమార్, జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న మహిళకు ఆర్థికసాయం

రేపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న 17వ వార్డుకు చెందిన తాడిపర్తి కృష్ణకుమారికి రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అందించిన ఆర్థిక సాయాన్ని శుక్రవారం స్థానిక టీడీపీ నేతలు తాడిపర్తి మల్లికార్జునరావు, జీవీ నాగేశ్వరరావు అదించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నందుకు ఆర్థిక స్తోమత లేక నానా ఇబ్బందులకు గురౌవుతున్నారు. స్థానిక టీడీపీ నాయకులు మంత్రి అనగాని దృష్టికి తీసుకుని వెళ్ళటంతో రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మేకా రామకృష్ణ, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, నీలి వెంకయ్య, తంగెళ్ళమూడి సాయిబాబు, యేమినేని యానాదిరావు తదితరులు పాల్గొన్నారు.


విజ్ఞాన ప్రదర్శనలో సూరేపల్లి విద్యార్థులకు తృతీయ స్థానం

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో సూరేపల్లి విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. సూరేపల్లి బీపీ అండ్ జీఎస్ఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు బాపట్లలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవంలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు దాసరి అమర్ అభిషిక్త్, ఆరేపల్లి గౌరినగేశ్వర్ అత్యుత్తమ ప్రతిభ పాటవాలు ప్రదర్శించి తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసశర్మ శుక్రవారం తెలిపారు. విద్యార్థులను పాలకవర్గ అధ్యక్షుడు వి.చలమయ్య, కార్యదర్శి ఆర్.వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా అనంత భోగేశ్వరస్వామి రథోత్సవం

కొల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గంగా పార్వతి సమేత అనంత భోగేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి స్వామి వారి రథంగ హోమం, రథోత్సవం వైభవంగా జరిపారు. స్వామి వారు రథంపై గ్రామ పురవీధుల్లో విహరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట తిరునాళ్లతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రథోత్సవం అనంతరం పూర్ణాహుతి, బలిహరణ, వసంతోత్సవం, శ్రీవారి పవళింపు సేవ నిర్వహించారు.

కన్నులపండువగా అప్పికట్ల రథోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ మానం విజేత దంపతులు

బాపట్లరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలో ఉన్న శ్రీ గంగా అన్నపూర్ణా విశాలక్షిసమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం ఎంతో వైభవంగా ముగిసింది. స్వామివారి రథోత్సవం గ్రామంలో గురువారం రాత్రి మొత్తం నిర్వహించి ఉత్సవ విగ్రహాలను నిద్రచేయించి మరుసటిరోజు రథాన్ని ఆలయానికి చేర్చటం అనవాయితీగా వస్తున్నది. రథోత్సవం సందర్భంగా మాజీ ఎంపీపీ మానం విజేత దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. రథాన్ని ఆలయానికి చేర్చిన వెంటనే మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆనాడు యరపతినేని చొరవతోనే అధికారం

● టీడీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 2014 రాష్ట్ర విభజన సంక్షోభ సమయంలో గురజాల నియోజకవర్గంలో యరపతినేని శ్రీనివాసరావు చూపిన చొరవను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం మరోసారి గుర్తుచేశారు. బడ్జెట్ అనంతరం టీడీఎల్పీ సమావేశం జరగ్గా అందులో చంద్రబాబు గురజాల గురించి, ఎమ్మెల్యే యరపతినేని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2014లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడానికి గురజాల నుంచి నాంది పలికిందన్నారు. 2013 సెప్టెంబరు 1న ఆత్మగౌరవ యాత్ర ఎక్కడి నుంచి చేపట్టాలని ఆలోచన చేస్తున్న సమయంలో నేనున్నానంటూ యరపతినేని ముందుకు వచ్చారన్నారు. గురజాల నుంచి యాత్రను ప్రారంభించాలని కోరారన్నారు. దీంతో అక్కడి నుంచే ఆత్మగౌరవయాత్ర మొదలుపెట్టడం జరిగిందన్నారు. గురజాల స్పందనతో రాష్ట్రంలో పర్యటన కొనసాగించానని, దీంతో టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆనాడు యాత్ర చేపట్టేందుకు యరపతినేని ముందుకు రావడం, విజయవంతం చేసేందుకు చేసిన కృషి నాకింకా గుర్తేనని చంద్రబాబు ప్రస్తావించారు.

ఎయిమ్స్‌లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
● మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య సేవలపై ఆరా
● రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న పెమ్మసాని
● ఎయిమ్స్ అభివృద్ధిపై వైద్యాధికారులతో సమీక్ష

మంగళగిరి సిటీ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ భాగస్వామ్యంతో మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో రోగులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఎయిమ్స్‌లో ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ, ఆపరేషన్ థియేటర్లు, ఇతర విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలపై అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశ మందిరంలో ఎయిమ్స్ అధికారులు, వైద్యులతో ఆసుపత్రి పురోభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో ప్రఖ్యాత ఎయిమ్స్ వైద్యశాల వుంటే ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని సీఎం చంద్రబాబు మంగళగిరిలో ఎయిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేయించారని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ ఎయిమ్స్‌కు అవసరమైన విద్యుత్, మంచినీటిని అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎయిమ్స్‌కు పదెకరాల అదనపు స్థలంతోపాటు విద్యుత్, మంచినీటి సరఫరాను అందించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎయిమ్స్‌లో ఏడున్నర లక్షల మందికి పైగా అవుట్ పేషెంట్ రోగులు వైద్య సేవలు పొందారని, ప్రతిరోజు సుమారు 3,200 ఓపీ నమోదవుతుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని చెప్పారు. అందుకు అనుగుణంగా ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం వుందన్నారు. తన పరిశీలనలో 95 శాతం మంది రోగులు వైద్య సేవలు, సౌకర్యాలపై సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్యం అందుబాటులో వుందన్నారు. అయితే, 960 బెడ్లు అవసరం వుండగా ప్రస్తుతం 600 మాత్రమే అందుబాటులో వున్నాయని, ఐసీయూలో 96 బెడ్లు అవసరం వుందగా ప్రస్తుతం 20 మాత్రమే అందుబాటులో వున్నాయని చెప్పారు. ఫార్మసీలో మెడికల్ స్టోర్స్ షార్టేజీ, ప్రజలకు రవాణా సౌకర్యం, బస్సు షెల్టర్లు లేకపోవడం వంటి సమస్యలను గుర్తించామని, త్వరలోనే వాటన్నింటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ సీఎస్ఆర్ ద్వారా రెండు షటిల్ బస్సు సర్వీసులను నడిపే ఏర్పాటు చేశారని, ఎన్నికల కోడ్ ముగియగానే ఆ సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇన్‌పేషెంట్ తాలూకా కుటుంబ సభ్యులు రోజుల తరబడి ఆసుపత్రిలోనే వుండాల్సిన పరిస్థితులు వున్నాయని, వారి సౌకర్యార్థం ధర్మశాల భవనాన్ని మరింత విస్తరిస్తామని చెప్పారు. ప్రైవేటు అంబులెన్స్‌ల వారు అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై పరిశీలన జరిపి కిలోమీటరు చొప్పున నిర్ణీత ధరలతో త్వరలోనే బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, ఉద్యోగులు, సిబ్బంది నియామకాల్లో అవకతవకలు జరిగినట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఆ ఆరోపణలపై విచారణ జరిపిస్తామని, ఎయిమ్స్‌లో క్యాంటిన్ల నిర్వహణ కోసం మరిన్ని టెండర్లు పిలుస్తామని మంత్రి పెమ్మసాని స్పష్టం చేశారు. ఎయిమ్స్‌లో రోగులు, వైద్యులు, విద్యార్థులు, సిబ్బందికి అవసరమైన కనీస సదుపాయాలను త్వరితగిన పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెమ్ శాంతా సింగ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.



ఎయిమ్స్‌లో వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



జన ఔషధి విభాగాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

ఆధునిక అంశాలపై పట్టు సాధించాలి

● మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ ఠాకూర్



ప్రసంగిస్తున్న రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్పీ ఠాకూర్

పెదకాకాని, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నేటితరం విద్యార్థులు, యువత ఆధునిక అంశాలపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్పీ ఠాకూర్ సూచించారు. విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగం, ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరం సంయుక్తంగా ఫ్రమ్ స్టూడెంట్ టు ఎక్స్‌పెర్ట్ లీడర్షిప్ పైప్ లైన్ ఫర్ మోడ్రన్ వర్క్ ప్లేస్ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ ఠాకూర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తమను తాము మలుచుకోవాలని, అందుకోసం ప్రత్యేక శ్రద్ధ వహించి వివిధ ఆధునిక అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వీటిలో వ్యాపార స్థాపన, అభివృద్ధి వైపు యువత అడుగులు వేయాలని పేర్కొన్నారు. స్వీయ నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం కోసం పుస్తక పఠనం కొనసాగించాలని చెప్పారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థుల్లో నిత్యం కొత్త అంశాల పట్ల అవగాహన కల్పించే విధంగా ఇటువంటి ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. థింకర్స్ ఫోరం ఎన్ఐటీ వరంగల్ నుంచి డాక్టర్ కె.వెంకట కృష్ణారావు, వాణిజ్య విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎన్.రత్న కిషోర్, డాక్టర్ ఎ.కనకదుర్గ, డాక్టర్ జి.నాగరాజు, డాక్టర్ వి.విష్ణు, డాక్టర్ కే.సుధీర్ కుమార్, డాక్టర్ చంద్రబాను రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ రఫీ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, జేసీలు
● పటిష్ట బందోబస్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు గుంటూరు ఏసీ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్నాయి. మొత్తం ఆరు జిల్లాలకు చెందిన బ్యాలట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌లను శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు పరిశీలించారు. బ్యాలెట్ బాక్సుల సీల్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పోలీసుల బందోబస్తును పర్యవేక్షించారు. అనంతరం ఏసీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సిబ్బంది సీల్ వేశారు.



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

భాష, సాహిత్యాలే వ్యక్తిత్వ వికాసానికి మూలం

● వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భాష, సాహిత్యాలే వ్యక్తిత్వ వికాసానికి మూలం అని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలో రెండు రోజులుగా ఆర్ట్స్ కామర్స్, లా కళాశాల ఆధ్వర్యంలో 'కాల్పనికేతర సాహిత్య ధోరణులు 21వ శతాబ్దం దక్షిణ భారత భాషలు' అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ గత రెండు రోజులుగా దక్షిణ భారత దేశ భాషలలో సాహితీ అంశాలపై ఉర్దూ విభాగం వారు సదస్సు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఆచార్య కోయి కోటేశ్వరరావు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందటానికి సాహిత్యం ఏ విధంగా ప్రభావం చూపుతుందో తెలియజేసిన విధానం అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం ముగింపు సభలో రెండు రోజులుగా సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందించారు.

జన్మభూమి, సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కడియం - ద్వారపూడి - అనపర్తి సెక్షన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా సింహాద్రి, జన్మభూమి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి 1, 2 తేదీల్లో, నంబరు. 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి 2, 3 తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి, నంబరు. 22701 విశాఖపట్నం - గుంటూరు, నంబరు. 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మార్చి 2వ తేదీన రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 3వ తేదీన రద్దు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

మంగళగిరి-తెనాలి-నారాకోడూరు మధ్య నాలుగు లేన్ల రహదారి

● మంత్రి లోకేశ్ చొరవతో డీపీఆర్ రూపకల్పన పనులు



మంగళగిరి-తెనాలి రోడ్డుపై కొలతలు వేస్తున్న సిబ్బంది

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రధాన రహదార్లకు మోక్షం కలుగుతోంది. ఇప్పటికే జిల్లాలో కీలక రోడ్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే తెనాలి-గుంటూరు వయా నారాకోడూరు, తెనాలి-విజయవాడ వయా మంగళగిరి రహదార్ల విస్తరణకు ఆమోదం లభించింది. తెనాలి నుంచి గుంటూరు మార్గంలో నారాకోడూరు వరకు, తెనాలి నుంచి విజయవాడ మార్గంలో మంగళగిరి హైవే వరకు నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో అధికారులు డీపీఆర్ రూపకల్పన పనులు కూడా ప్రారంభించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో గుంతల రహదార్లతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేశ్ చొరవతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతున్నాయి. ఆయా గ్రామాల మధ్య తారురోడ్ల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరుచేసి పనులను ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి-తెనాలి-నారాకోడూరు మధ్య 40.05 కిలోమీటర్ల మేర రహదార్లను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.కోటి 12వేలు విడుదల చేసింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డీపీఆర్ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.



మంచినీటి చెరువులో హంస వాహనంపై విహరిస్తున్న ఉభయ దేవేరీ సమేతుడైన మల్లేశ్వరుడు

వైభవంగా మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం

పెదకాకాని, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి హంస వాహనంపై మంచినీటి చెరువులో విహరించారు. మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ, గంగాదేవి అమ్మవార్లు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమరావతి రాజధాని ప్రాజెక్టులను పర్యవేక్షించనున్న సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్

● ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ బృందంతో ఒప్పందం కుదుర్చుకొన్న ఏపీ సీఆర్‌డీఏ
● రాజధానిలో జరిగే పనులన్నీ పర్యవేక్షణ బాధ్యత వీరిదే !

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అభివృద్ధి ప్రాజెక్టుల పనులన్నింటినీ పర్యవేక్షించటం కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(పీఎంసీ)లుగా సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్‌లు వ్యవహరించనున్నాయి. గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఆ సంస్థలతో ఉన్నతాధికారులు ఒప్పందం చేసుకున్నారు. సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్‌ల కన్సల్‌టెంట్ల బృందం రాజధాని అమరావతి నిర్మాణ పనులను పరుగులు పెట్టించటానికి వీలుగా పనిచేయనున్నారు. రాజధానిలో సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీఎల్) లు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థల పనులను ఈ కన్సల్‌టెంట్ బృందం పర్యవేక్షిస్తుంది. అదేవిధంగా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ఆర్థిక సహకారంతో రాజధానిలో జరగనున్న నిర్మాణపనులలో నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు అమలుపరిచే బాధ్యతలను కూడా సుర్బానా, నైట్ ఫ్రాంక్‌ల పీజీఎంసీ బృందం తోడ్పాటునందించనుంది. శుక్రవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో సుర్బానా, నైట్ ఫ్రాంక్‌లతో ఈ మేరకు ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఆర్‌డీఏ తరపున అదనపు కమిషనర్ (అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలు) నవీన్ మల్లారపు, సుర్బానా జురాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ (సౌత్ ఇండియా) అవినాశ్ మిశ్రా ఒప్పందపత్రాలను పరస్ప రం మార్చుకున్నారు. సీఆర్‌డీఏ స్ట్రా టజీ విభాగ డైరెక్టర్ ఎన్.సతీష్‌బా బు, సుర్బానా జురాంగ్ ఇండి యా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ అభిషేక్ మల్హోత్రా, నైట్ ఫ్రాంక్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తరపున ఆ సంస్థ డైరెక్టర్ విశ్వబంధు మెహ్రా పాల్గొన్నారు.

అమరావతి విల్డర్‌నెస్ పార్కు డీపీఆర్ సిద్ధం చేయండి

● 'ప్రగతి' ప్రతినిధులతో ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విభిన్నమైన ప్రకృతి సోయగాలతో టూరిస్టులను కట్టిపడేసేలా అమరావతిలోని శాఖమూరులో విల్డర్‌నెస్ పార్కును రూపొందించేందుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేయాలని ప్రగతి సంస్థ ప్రతినిధులకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ డి.లక్ష్మీపార్థసారథి సూచించారు. శుక్రవారం విజయవాడ ఏడీసీ ప్రధాన కార్యాలయంలో ప్రగతి ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. శాఖమూరు సెంట్రల్‌పార్కులో విల్డర్‌నెస్ పార్కు నిర్మాణానికి ఏడీసీ 20 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో ప్రకృతి ప్రసిద్ధిగాంచిన వృక్షజాలాన్ని పర్యావరణహితంగా పెంచి, పర్యాటకానికి ఆలవాలంగా తీర్చిదిద్దడమే పార్కు లక్ష్యం. ప్రకృతి ప్రియులను ఆకర్షించే రమ్యమైన రిసార్టులు నిర్మించి వాటి సరసన అరుదుగా కనిపించే ప్రకృతిసిద్ధమైన మొక్కలను పెంచి అవసరమైన మేరకు వసతిని కల్పించేవిధంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుంది. సాధారణ ప్రజలందరికీ విల్డర్‌నెస్ పార్కులోనికి ఉచితప్రవేశాన్ని కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని, ప్రముఖ పర్వదినాల నాడు ప్రజల భక్తిభావాలకు అనుగుణంగా ఉండే దేవతా వృక్షాలను ఇక్కడ పెంచేలా చూడాలని ప్రగతి ప్రతినిధులను సీఎండీ కోరారు. ఈ సమావేశంలో ఏడీసీ అర్బన్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ హెడ్ పి.సురేష్‌బాబు, సీనియర్ అర్బన్ కె.లవణ్‌కుమార్, ప్రగతి సంస్థ ఛైర్మన్ జీటీకే రావు, ఎండీ జి.ఆంజనేయులు హాజరయ్యారు.



ప్రగతి సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి

కోల్డ్‌స్టోరేజీల్లో మిర్చికి రుణాలివ్వాలి

● సీఎం ఆదేశాలను వివరించిన మార్కెటింగ్ జేడీ

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శీతల గిడ్డంగుల్లో మిర్చి నిల్వ చేసుకొంటున్న రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని తెలిసింది.. ఇది సరైన పద్ధతి కాదు.. సీఎం చంద్రబాబు ఈ విషయంలో చాలా ఆగ్రహంగా ఉన్నారని మార్కెటింగ్ శాఖ విజయవాడ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మిర్చియార్డు పరిపాలన భవనంలో ఆయన లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్(ఎల్‌డీఎం) మహిపాల్‌రెడ్డితో కలిసి కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు, మార్కెటింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత శనివారం సీఎం చంద్రబాబు వద్ద జరిగిన సమావేశంలో కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చి టిక్కీలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని పలువురు చెప్పారని, ఇందుకు గల కారణాలను తెలుసుకొని నివేదించాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. సమావేశానికి హాజరైన కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా తమ వద్ద రైతులు నిల్వ చేసుకొంటున్న మిర్చికి బ్యాంకర్లు రుణాలు ఇస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో తమ ఆస్తులను తనఖా పెట్టుకొంటున్నారని తెలిపారు. 2023, 24 ఆర్థిక సంవత్సరాల్లో మిర్చి ధర అధికంగా ఉండటంతో బ్యాంకర్లు రుణాలు ఇచ్చారని, అయితే ఆ తర్వాత ధర పడిపోవడంతో రైతులు కోల్డ్‌స్టోరేజ్‌లలో అలానే టిక్కీలు ఉంచేసి బ్యాంకులకు రీపేమెంట్ చేయలేదన్నారు. ప్రస్తుతం గుంటూరు పరిసరాల్లోని 90 కోల్డ్‌స్టోరేజ్‌లలో దాదాపుగా 20 లక్షల పాత మిర్చి టిక్కీలున్నాయని, ప్రస్తుత సీజన్‌లో మరో 9 లక్షల టిక్కీల వరకు నిల్వ చేశారని చెప్పారు. ఎవరైతే బకాయిలున్నారో వారికి కొత్తగా రుణాలు ఇవ్వమని తాము కోరడం లేదని, ఎవరైతే సక్రమంగా చెల్లించారో, అలానే కొత్తగా రుణాల కోసం వస్తున్నారో వాళ్లకు ఇవ్వమని కోరుతున్నామన్నారు. బ్యాంకర్ల తరుపున ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, సిటీ యూనియన్ బ్యాంకు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చికి టర్మ్‌లోన్ ఇస్తామన్నారు. సమావేశంలో మిర్చి యార్డు సెక్రెటరీ ఎ.చంద్రిక, మార్కెటింగ్ డీడీ ఝాన్సీరాణి, ఏడీ బి.రాజబాబు, కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానుల సంఘం నుంచి కర్లపూడి వెంకటేశ్వరరావు, సురేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొత్తూరి సుధాకర్, పమిడి కృష్ణ, వివిధ గ్రేడ్‌ల సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఆంజనేయసింగ్ తదితరులు పాల్గొన్నారు.

9 మంది కమీషన్ వ్యాపారస్తుల లైసెన్సుల నిలుపుదల

మిర్చియార్డులో ట్రాఫిక్‌కి ఆటంకం కలిగిస్తున్న కమీషన్ వ్యాపారస్తులపై మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు కొరడా ఝుళిపించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మార్కెటింగ్, మిర్చియార్డు అధికారులతో కలిసి యార్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గేటు నంబరు. 4 ఎదురుగా ఉన్న కమీషన్ దుకాణాల వ్యాపారస్తులు మిర్చి టిక్కీలు అన్ని రోడ్లపై పడేసి వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలిగించారు. దీనిపై జేడీ శ్రీనివాసరావు సీరియస్ అయి వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే మీరేమి చేస్తున్నారని సూపర్‌వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత వ్యాపారస్తుల లైసెన్సులను నిలుపుదల చేసినట్లుగా మైకులో ప్రకటన చేయించాలని ఆదేశించారు. శనివారం మిర్చియార్డు పరిపాలనభవనంలో కమీషన్ వ్యాపారులతో సమావేశం కావాలని నిర్ణయించారు.



బ్యాంకర్లు, కోల్డ్‌స్టోరేజీల యజమానులతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

బొబ్బేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి

మార్టూరు, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు గంగా బసవయ్య (80) అనారోగ్యంతో గురువారం రాత్రి స్వగృహంలో మృతిచెందారు.ఆయనకు భార్య,ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బసవయ్య మృతి పట్ల పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు ఓ ప్రకటనలో సంతాపం తెలియచేశారు.వారి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి టీడీపీ నాయకులు కామేపల్లి హరిబాబు, మిన్నెకంటి రవికుమార్, తేలప్రోలు సాంబ శివరావులు బసవయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గుండెలు ఆగుతున్నాయ్..

నిన్నొకరు..నేడొకరు పట్టణంలో మృతి

చీరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో గుండెపోటు మృతుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వయసుతో సంబంధం లేకుండా ప్రజలు మృత్యువాత పడుతున్నారు. అయితే మృతుల్లో అందరూ పురుషులు కావడం గమనార్హం. గురువారం రాత్రి స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదురుగా గుర్తుతెలియని సుమారు 45 సంవత్సరములు కలిగిన వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. అయితే అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. అలాగే ఎటువంటి భిన్న వాతావరణం లేకుండా సాధారణంగా మృతి చెంది ఉండటంతో గుండెపోటు మరణంగా వన్‌టౌన్ పోలీసులు భావిస్తున్నారు. ఈక్రమంలోనే ఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే శుక్రవారం ఉదయం పట్టణంలోని ఓ లాడ్జి సమీపంలో స్థానిక నవాబ్‌పేట జేమ్స్ స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన కోడూరి వెంకట రవి కుమార్(45) మృతి చెందాడు. ఈఘటనపై కూడా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇటీవల కాలంలో చీరాల పరిధిలో గుండె పోటు మృతుల సంఖ్య అధికంగా నమోదు అవుతోంది.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

మార్టూరు,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):టైలర్స్ డే వేడుకలను శుక్రవారం మార్టూరులో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాత సొసైటీ బ్యాంక్ రోడ్డులో టైలర్స్ జండాను ఎగురవేశారు. తరువాత జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టైలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు,ఫిబ్రవరి28,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పావులూరులో గురువారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన సింహాద్రి వెంకటేశ్వరరెడ్డి మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుటుంబసభ్యులు వెంకాయమ్మ, శ్రీనివాసరెడ్డి, ఇందిర, నాగేశ్వరమ్మలను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, పులఖండం బద్రిరెడ్డి, రోటరీ సభ్యులు అభినందించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అయ్యప్ప సేవాసమితి సభ్యులు

అద్దంకి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం అన్నసంతర్పణ నిర్వహించారు. టీడీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు సహకారంతో స్థానిక పొట్టిశ్రీరాములు బొమ్మ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. వాసు గురుస్వామి,చెన్నా వెంకటేశ్వర్లు, కురిచేటి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం వేటపాలెంలోని దేశాయిపేటలోగల ఎంఎల్ఎస్ స్టాకు పాయింట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ పార్వతి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



విద్యార్థుల సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ ప్రయోగాల పట్ల ఆసక్తిని పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కట్టకిందపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ ప్రయోగాలను చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో సుధాకరరావు, హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ రవి, మున్నంగి చిన్న బావూజి, సీఆర్‌పీ, ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం-2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం : మండలంలోని పెద గంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీవీరామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు సైన్సు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సైన్సు వేడుకలను సైన్సు ఉపాధ్యాయులు డి.ఆషాలత, డి.సుబ్బారావు, హెచ్‌ఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.వీరాచారి, కే.నాగరాజు, ఎస్.శ్రీరమణ, ఎస్.రమణమూర్తి, టి.వినయ్‌కుమార్, ఎం.రవి చంద్రరామ్, ఎ.సుబ్బరాజు, షేక్.సుభానిభాష, ఎం.కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో...

ఇంకొల్లు: మండలంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌ఆర్ హైస్కూల్, ఆదర్శ, నివేదిత, గౌతమి, ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,డైరెక్టర్లు,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సవరణలు

(5వ పేజీ తరువాయి)

ఉండటంతో వాటి దిద్దుబాటు చేపట్టారు.

అర్జీ అవసరం లేకుండా.. రైతులను తిప్పుకోకుండా..

గడచిన శతాబ్దకాలంగా పదిలంగా ఉన్న ఎందరో భూముల హక్కులు ఒక్క సంవత్సరంలో మారిపోయాయి. ఉదాహరణకు పొన్నూరు పట్టణ పరిధిలో 220 ఎకరాల భూమి కేవలం ఐదుగురు వ్యక్తుల పేరుపై నమోదు చేయడం తెలిసిందే. ఇదే తీరులో ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో పేర్ల మార్పులు జరిగాయి. పొన్నూరులో జరిగిన లోపాలను నేటికీ సరిచేస్తూనే ఉన్నారు. అయితే తెనాలిలో మాత్రం రైతు దరఖాస్తు చేసుకోవడం, కార్యాలయం చుట్టూ తిరగడం, లంచాల రూపంలో చదివించుకోవడం వంటివి లేకుండానే తప్పులు సరిచేస్తున్నారు. ఇప్పటికే సంగంజాగర్లమూడి, కొలవరం, నందివెలుగు, గుడివాడ, మల్లెపాడు, దేవరపల్లి అగ్రహారం వంటి గ్రామాల్లో రికార్డులను సరిచేశారు. ప్రస్తుతం బుర్రిపాలెం గ్రామాన్ని ఎంపిక చేసుకున్నారు. 291 సర్వే నంబర్లలో మొత్తం 1732 ఎకరాల భూమి ఉంటే యాజమాన్య హక్కులు మారినవి, లెగసీ కేసుల వంటివి ఎక్కువ గుర్తించారు. ఈ గ్రామంలో ఇటీవల రెవెన్యూ సదస్సు పెడితే అధికారులకు భూమి సమస్యలకు సంబంధించి అందిన దరఖాస్తులు కేవలం 2 మాత్రమే. అయితే ఇక్కడ సమస్యలు మాత్రం 100కుపైనే ఉన్నాయి. అంటే ఇద్దరికి మినహా మిగిలిన రైతులకు వారి భూమికి సంబంధించి సమస్య ఉందనే విషయం కూడా తెలియదు. అయితే ఈ మొత్తాన్ని పరిష్కరించి, వాటిని సరిచెయ్యాలని అధికారులు నిర్ణయించారు.



తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ

సమస్యలన్నీ పరిష్కరించేలా

ఇకపై ఏ రైతూ అంతుబట్టని చిక్కులతో హక్కుల కోసం పోరాడాల్సిన అవసరంలేదు. గతంలో మా వల్ల జరిగిన భూముల తప్పులు మేమే సరిదిద్దాలని నిర్ణయించుకున్నాం. రీ సర్వేలో లోపాలు మళ్లీ కనిపించకుండా, రైతులకు ఏ ఇబ్బంది లేకుండా పరిష్కారం చూపదలిచాం. ఏ ఒక్క రైతు నుంచి భూ సమస్యలపై అర్జీ రాకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకుని మోడల్‌గా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. మా ప్రయత్నానికి జేసీ, సబ్‌కలెక్టర్ పూర్తి సహకారం అందిస్తున్నారు. తప్పులను సరిదిద్దేందుకు ఏ రైతూ లంచం ఇవ్వాల్సిన అవసరంలేదు. - గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి

విస్తు కలిగించే విషయాలెన్నో!

- బుర్రిపాలెంలో జగనన్న కాలనీ కోసం మూడేళ్ల క్రితం 198.22 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇంకా రైతుల పేరుపైనే భూమి ఉంది. ప్రభుత్వ భూమిగా మార్చాల్సిన భూమినీ అధికారులు మార్చలేదంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతుంది.
- 9999, 99999 ఖాతా నంబర్లలో 196 సర్వే నంబర్లను చేర్చారు. భూ విస్తీర్ణం 460 ఎకరాలపైనే. అయితే ఈ విషయం రైతులకు తెలియదు. దీనిని అధికారులే గుర్తించారు.
- రైతుల పేరు బదులు '0' అని నమోదు చేశారు. దీనివల్ల రైతు తన భూమిని అమ్ముకోడానికి వీలు లేని పరిస్థితి.
- లెగసీ కేసులు కూడా చాలానే ఉన్నాయి. ఒక రైతుపేరుపై ఉండాల్సిన వాస్తవ విస్తీర్ణం కాకుండా దానికి మించి కానీ, తక్కువగా కానీ చూపడం, వాటిని మరొకరి పేరుకు చేర్చడం వంటి వాటిని గుర్తించారు.
- 80కిపైగా సర్వే నంబర్లలో అసలు రైతు పేరు కాకుండా ఇతరుల పేర్లు నమోదు చేశారు. రైతు పేరుపై పట్టా, ఇతర హక్కు పత్రాలన్నీ కచ్చితంగా ఉన్నా, వాటిని గతంలో సరిచేసిందేలేదు.
- గ్రామంలో 291 సర్వే నంబర్లుంటే, వీటిలో 60 ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు. అవి ఏ రైతులకు సంబంధించినవో అంతుబట్టని విషయం.

ఉపాధి పనుల్లో దొంగ మస్టర్‌లపై విచారణ

కమిషనర్ ఆదేశాలతో అధికారులు, సిబ్బందిలో వణుకు

ఇప్పటికే రికార్డులు సరిచేసే పనిలో నిమగ్నం

అవినీతి వెలుగు చూడకుండా చేసుకునేందుకు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

అద్దంకి/బల్లికురవ, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులలో దొంగ మస్టర్‌లపై విచారణకు పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశించటంతో సంతమాగులూరు, బల్లికురవ మండలాలలోని ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైంది. ఈ క్రమంలో ఇప్పటికే రికార్డులు సరిచేసే పనిలో అధికారులు, సిబ్బంది నిమగ్నమైనట్లు తెలుస్తోంది. 4 రోజులుగా మస్టర్లకు సంబంధించిన రికార్డులు ఎక్కడికక్కడ సరిచేసే పనిలో ఉన్నారు. అదే సమయంలో తమను ఏదో ఒక విధంగా బయట పడేలా చేయాలని అధికారులు, సిబ్బంది తమకు అనుకూలంగా ఉండే మండల, గ్రామ స్థాయి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కొంత మంది నేతలు హామీ ఇస్తున్నప్పటికి ఎక్కువ మంది నేతలు మాత్రం తగిన శాస్తి జరగాలిలే అంటున్నారు. ప్రధానంగా సంతమాగులూరు మండలంలోని అత్యధిక గ్రామాలలో పెద్ద ఎత్తున దొంగ మస్టర్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లలో ఆందోళన నెలకొనగా, పర్యవేక్షణ చేసే మండల స్థాయి అధికారి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ..., అన్నీ నేను చూసుకుంటాను... మీరు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇస్తున్నట్లు సమాచారం. అవసరమైతే విజిలెన్స్ విచారణ కూడా రాకుండా చూసుకుంటానని కూడా చెప్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉపాధిహామీ పథకం పీడీ విజయలక్ష్మి సంతమాగులూరు మండలంలో పనులు పరిశీలన చేయటంతో ఆందోళన మరింత పెరిగినట్లు తెలుస్తోంది. విచారణకు విజిలెన్స్ అధికారులు సోమవారం తరువాత ఎప్పుడైనా రావచ్చని, ఈ నేపథ్యంలో ఎంత మేర సరిచేస్తారో, ఎంత మేర దొరుకుతారో వేచి చూడాల్సి ఉంది. లోతుగా పరిశీలిస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు సుదూర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారి పేర్లతో వేసిన మస్టర్‌లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉపాధి పనుల కంటే మిర్చి కోతలకు ఎక్కువ మంది కూలీలు వెళ్తున్న తరుణంలో పెద్ద ఎత్తున మస్టర్‌లు నమోదు కావటం కూడా అనుమానాలకు మరింత తావిస్తున్నది.

హరహరమహాదేవ శంభో...



రథోత్సవంలో ఎమ్మెల్యే జనార్ధన్ దంపతులు

వైభవంగా శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం

కొత్తపట్నం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో జంట గ్రామాలైన మడనూరు-ఈతముక్కలలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామికి శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణల మధ్య రథోత్సవం మడనూరులోని ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, అతని కుటుంబ సభ్యులు, ఎంఆర్‌వో పిన్నిక మధుసూదనరావులు హాజరయ్యారు. రథోత్సవాన్ని తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాలతోపాటు జిల్లాలోని ఇతరప్రాంతాల నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముక్తకంఠంతో శివనామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. హరహర మహాదేవశంభోశంకర అంటూ భక్తులు నామస్మరణ చేశారు. గ్రామ ప్రధాన మార్గాల ద్వారా రథోత్సవం కొనసాగింది. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత రథోత్సవాన్ని ఈతముక్కల గ్రామానికి చేర్చారు. శనివారం ఈతముక్కల గ్రామం నుంచి రథోత్సవం ప్రారంభమై మడనూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకోనుంది. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా పూజలు చేస్తూ శివనామస్మరణ చేస్తూ ముందుకు సాగారు.

అమరావతికి అగ్రతాంబూలం

(5వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుతో హర్షం

అవసరాల నిమిత్తం తాజాగా బడ్జెట్లో మరో 297.82 కోట్లు కేటాయించారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్

నేతన్నలు, నాయీబ్రాహ్మణులకు విద్యుత్ భారం తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నట్లుగానే నేతన్నలకు, నాయీబ్రాహ్మణులకు ఉచితంగా విద్యుత్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం అందుబాటులోకి వస్తే గుంటూరు జిల్లాలో 10 వేలు, బాపట్ల జిల్లాలో 17 వేలు, పల్నాడు జిల్లాలో 3 వేల చేనేత కుటుంబాలకు భారీ ఊరట లభించనుంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన ఆదరణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా, తాజాగా ఆ పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం పునరుద్ధరిస్తే నాయీబ్రాహ్మణ, రజక, చేనేత, కల్లుగీత కార్మికులు, కుమ్మరి, కమ్మరి ఇతర కుల, చేతి వృత్తులవారికి వృత్తిపరమైన భరోసా లభిస్తుంది.

దీపం- 2లో 14 లక్షల మందికి లబ్ధి

దీపం- 2 పథకాన్ని ఇప్పటికే ప్రారంభించిన ప్రభుత్వం గత బడ్జెట్లో ఒక సిలిండరును లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేసింది. తాజా బడ్జెట్లో ఈ పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించడంతో ఈ ఏడాది మూడు గ్యాసు సిలిండర్లు ఉచితంగా అందనున్నాయి. మూడు జిల్లాల్లోని 14 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ఏడాది రూ.357 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

అవ్వాతాతల కళ్లలో ఆనందం

అవ్వాతాతలు, వితంతువులు, వంటరి మహిళలు, దివ్యాంగులకు చేయూతనిచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు భారీగా నిధులు కేటాయించారు. సూపర్ సిక్సులో హామీల్లో కీలకమైన హామీని అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచిన ప్రభుత్వం బడ్జెట్లోనూ అదే ప్రాధాన్యాన్ని కల్పించింది. బడ్జెట్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 7లక్షల 40వేల మంది లబ్ధిదారులకు రూ.3,880 కోట్లు కేటాయించింది. బడ్జెట్లోనే కేటాయింపులతో ఏడాది పాటు అవ్వాతాతల పింఛనుకు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది.

ప్రసన్నాంజనేయుడికి కదళీఫలార్చన

అవీఇవీ



శింగరకొండలో ప్రసన్నాంజనేయస్వామికి అరటి పండ్ల పూజ అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామి

అద్దంకి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం దశ సహస్ర కదళీ ఫలార్చన వైభవంగా జరిగింది. అమావాస్య సందర్భంగా వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా 10 వేల అరటి పండ్లతో ప్రత్యేక పూజ నిర్వహించి అలంకరించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసిన లక్ష్మీకుమారి

అధికారులు, ప్రజాప్రతినిధుల కితాబు



లక్ష్మీకుమారిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పంగులూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):పంగులూరుకు చెందిన బాచిన లక్ష్మీకుమారి ప్రభుత్వ ఉద్యోగిగా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి ఉత్తమ సేవలందించారని మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు కొనియాడారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన బాచిన లక్ష్మీకుమారిని పరిషత్ అధ్యక్షురాలు తేళ్ళ నాగమ్మ, జడ్పీటీసీ రాయిణి ప్రమీల, ఎంపీడీవో స్వరూపారాణిలు ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగిగా మూడు దశాబ్దాలకు పైగా పనిచేసి పలువురి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, రాయిణి వెంకట సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేయాలి



భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినేలా ఉపాధ్యాయులు శుచిగా, రుచిగా తయారు చేయించాలని ఎంఈవో కె. రమేష్ కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో ఎంఈవో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ముగిసే వరకు సెలవు రోజుల్లో కూడా భోజన పథకాన్ని నిర్వహిస్తున్నామని, విద్యార్థులందరూ పాఠశాలకు రావాలని అయన కోరారు.ఈ తనిఖీలో హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశువుల్లో గాలికుంటు రాకుండా వ్యాక్సిన్‌లు



మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

పర్చూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లోసిస్ వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేయించాలని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాధవి అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో ఆమె మాట్లాడారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి 1 నుంచి 30తేదీ వరకు అన్నీ గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలువేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఏ హైదరాబాద్ శాఖ కార్యదర్శిగా కారుమంచి



రామారావు

అడుసుమల్లి(పర్చూరు) ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ శాఖ కార్యదర్శిగా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన కారుమంచి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలో అడుసుమల్లిని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. ఈసందర్భంగా శుక్రవారం పర్చూరు నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

బస్టాండ్ స్థలంలో వ్యర్థాలు వేస్తే చర్యలు

బల్లికురవ. ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బస్‌స్టేషన్ స్థలంలో దుకాణదారులు వ్యర్థాలను పడవేస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ఈ చెత్త కనిపించదా' అన్న కథనం ప్రచురితం కావటంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు పంచాయతీ అధికారులు స్పందించారు. శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో బస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న వ్యర్థాలను తొలగించి గ్రామానికి దూరంగా పడవేశారు. ఈసందర్భంగా చిరు దుకాణదారులతో అయన మాట్లాడుతూ కొబ్బరి బొండాలను, ఖాళీ గ్లాసులను చికెన్ దుకాణ వ్యర్థాలను పడవేయటం వలన ప్రజలకు ఇబ్బందిగా ఉందని, ఎవరైనా వ్యర్థాలను ఇష్టానుసారంగా పడవేస్తే జరిమానాలు వేస్తామని అయన తెలిపారు.



వ్యర్థాలు తొలగించాక పరిశుభ్రంగా ఉన్న బస్ స్టేషన్ స్థలం

అవీ..ఇవీ

చెన్నకేశవుడికి సూర్యకిరణాభిషేకం


చెన్నకేశవుడిని అభిషేకిస్తున్న భానుడి కిరణాలు

పంగులూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను భానుడి కిరణాలు అభిషేకించాయి. ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఉదయం 6.30 నిముషాల నుంచి 6.50 నిముషాల వ్యవధిలో ఈ అపూర్వ ఘట్టం ఆవిష్కృతమయింది. ఈ విశేషాన్ని గ్రామంలోని పలువురు భక్తులు తిలకించారు. సౌరమానాన్ని అనుసరించి ప్రతి సంవత్సరం ఉత్తరాయణం కుంభ సంక్రమణంలో శతభిషం కార్తెలో రెండు రోజులు అనగా ఏటా ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఉదయం 6.30 నిముషాల నుంచి 6.50 నిముషాల వరకు, మళ్లీ దక్షిణాయణంలో కన్యా సంక్రమణంలో చిత్తకార్తెలో రెండు రోజుల పాటు అక్టోబరు 14, 15 తేదీలలో ఉదయం 6.10 నిముషాల నుంచి 6.30 నిముషాల వరకు ఆపాదమస్తకం సూర్య కిరణాలు మూలవిరాట్‌ను స్పృశిస్తాయని అర్చకస్వామి రఘునాథాచార్యులు తెలిపారు.


బల్లికురవలో గ్రౌండ్ వాటర్‌లెవల్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు


గ్రౌండ్ వాటర్ లెవల్స్ తనిఖీ

బల్లికురవ. ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ఉన్న గ్రౌండ్ వాటర్ లెవల్స్‌పై శుక్రవారం జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. బల్లికురవ ఉన్నత పాఠశాల, కొణిదెన గ్రామాలలో వాటర్ లెవల్‌ను పరిశీలించారు. గత నెలలో ఎంత లోతులో నీరు ఉంది, ఈనెలలో ఎంత లోతుకి వెళ్లింది అన్న వివరాలను వారు సేకరించారు. కొణిదెన గ్రామంలో 11 మీటర్ల లోతులో నీరు ఉందని, బల్లికురవలో 3.83 మీటర్లలోతులో నీరు ఉందని, ప్రజలు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని వారు కోరారు. ప్రతి నెలా నీటి లెవల్ పరిశీలన చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. ఈ పరిశీలనలో భూగర్భ వాటర్ లెవల్ జిల్లా ఏజీపీ వసంతకుమారి, ఏఈ శివ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా వచ్చే జర్వాల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్ సూచించారు. శుక్రవారం అద్దంకిలోని గాజులపాలెం యూపీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గాజులపాలెం, కాకానిపాలెం వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సీజనల్‌గా వచ్చే డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా లాంటి జ్వరాలు అదుపుచేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ గొట్టిపాటి జయసింహ, డాక్టర్ హేమమాధురి, అద్దంకి జోన్ మలేరియా సూపర్‌వైజర్ కె. అర్జున్, తదితరులు పాల్గొన్నారు.


అన్నాభిషేకం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ముగిసిన అంకమ్మతల్లి తిరునాళ్లు

చీరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం బూదాటివారి వీధిలో నిర్వహిస్తున్న అంకమ్మతల్లి వార్షిక తిరునాళ్ల శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం అంకమ్మతల్లికి అన్నాభిషేకం చేశారు. అలాగే భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు మిర్చి, పొగాకు రైతుల సమావేశం

చెరుకూరు(పర్చూరు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో మార్చి 2న మిర్చి, పొగాకు రైతుల సమావేశం జరుతుందని నల్లమడ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రైతుల సమక్షంలో రీ సర్వే

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్


దైవాలరావూరులో రీసర్వే గురించి రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

మేదరమెట్ల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే రైతుల సమక్షంలో జరిగేలా చూడాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని దైవాలరావూరులో రీసర్వేను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులను మీకు నోటీసులు ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. అక్కడ ఉన్న సర్వే నెంబర్‌లలో ఏ రైతుకు ఎంత భూమి ఉంది అని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో సర్వే చేయడం వలన తప్పులు దొర్లకుండా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా దైవాలరావూరు రైతులు 255 సర్వే నెంబర్‌లో ఉన్న గ్రామ కంఠాన్ని దేవదాయశాఖ నిషేధిత జాబితాలోకి తెచ్చిందని తెలిపారు. దేవాలయం భూమి 32 సెంట్లు ఉండగా గ్రామం మొత్తాన్ని 2016 సంవత్సరం నుంచి నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. అదే విధంగా సర్వే నెంబర్ 30బై1లో చెరువు మాన్యం ఉండగా 30వ సర్వే నెంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితాలోకి చేర్చారని రైతులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ రెండు సర్వే నెంబర్లను పరిశీలించి నివేదికలను తనకు పంపాలన్నారు. రోవర్‌ల పనితనం గురించి గ్రామ సర్వేయర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, సర్వే ఇన్‌స్పెక్టర్ జీవీ ముసలయ్య, మండల సర్వేయర్ మహేష్ బాబు, వీఆర్‌వోలు నరసింహారావు, నారాయణ, గ్రామ సర్వేయర్‌లు ఇమ్మానియేలు, రైతులు ముమ్మన నరసింహారావు, శ్రీనివాసరావు, రావి ఆంజనేయులు, బొక్కిసం జనార్దన్, ఆనంద్, సురేష్, దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.


పూనూరు లో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్‌డీవో గ్లోరియా, తహసీల్దారు రవికుమార్ తదితరులు

15 నాటికి రీ సర్వే పనులు పూర్తిచేయాలి

యద్దనపూడి,(మార్టూరు):యద్దనపూడి మండలం పూనూరుగ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులు ఈ నెల 15 వతేదీ నాటికి పూర్తిచేయాలని ఆర్‌డీవో గ్లోరియా రీసర్వే బృందాలను ఆదేశించారు. ఆమె శుక్రవారం పూనూరు గ్రామంలో రీసర్వే జరుగుతున్న పొలాలను పరిశీలించారు. గ్రామాల సరిహద్దు, పొలాల హద్దులు, ప్రభుత్వ భూములు తదితర వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ రీసర్వేలో ఎలాంటి లోపాలు జరగకూడదన్నారు. అదేవిధంగా రీసర్వే జరుగుతున్న వివరాలను తహసీల్దారు కె. రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పూనూరు గ్రామంలో4,900 ఎకరాలు పొలాలు ఉండగా వాటిలో 2,800 ఎకరాల సర్వే పూర్తయ్యిందని తహసీల్దారు ఆర్‌డీవోకు తెలిపారు. అంతేగాకుండా 4 ప్రత్యేక బృందాలు సర్వే చేస్తున్నాయన్నారు. గ్రామంలోని రైతుల సహకారంతో నిష్పక్షపాతంగా సర్వే చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలోడీఐ శ్రీనివాసరావు, డీటీ మస్తాన్‌రావు, మండల సర్వేయరు సాంబశివరావు, పలువురు వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏపీఎం రామకృష్ణ

పర్చూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్వయం సహాయ సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజ్ ద్వారా అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాని ఏపీఎం రామకృష్ణ కోరారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్చూరు బ్రాంచ్, అన్నంబొట్లవారి పాలెంలో ఎస్‌హెచ్‌జీ రుణమేళా జరిగింది. అందులో భాగంగా పర్చూరు బ్రాంచ్ పరిధిలో రూ.60 లక్షలను లబ్ధిదారులకు అందజేశారు. అందులో 10 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున అందజేయగా, టెంట్ హౌస్‌కు ఇద్దరు సభ్యులకు రూ.6,40000, గొర్రెల యూనిట్‌కు రూ.300000 మంజూరు, బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ.20 లక్షలకు సంబంధించిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ కుమార్, యూబీఐ ఫీల్డ్ ఆఫీసర్ లిజిపౌన్, సీసీలు పి.ప్రమీల, విజయ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, వీఏవోలు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.


రుణాల మంజూరు పత్రాలు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్, ఏపీఎం రామకృష్ణ, సిబ్బంది

సంఘాల బలోపేతానికి కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం కోటేశ్వరరావు

అద్దంకిటౌన్, : స్వయం సహాయక, మండల, గ్రామ సంఘాలు బలోపేతానికి రానున్న ఐదు సంవత్సరాలలో అనుసరించాల్సిన మార్గాలను గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై మండలంలోని 42 గ్రామ సమైఖ్య సంఘాల అధ్యక్షులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతు ప్రతి గ్రూపు అభివృద్ధి వైపు నడవాలంటే పొదుపు, రుణాలు సక్రమంగా జరుపుకుంటూ, సబ్సిడీతో కూడిన రుణాలను ఉపయోగించుకుని ఆదాయం వచ్చే మార్గాలను అనుసరిస్తూ ఆదాయం సృష్టించుకోవాలన్నారు. ఈక్రమంలో ఆదర్శ గ్రామం ఎలా ఉండాలో, పేదరికం నుంచి బయటకు రావాలంటే ఏఏ మార్గాలను అనుసరించాలి అనే విషయాలను చార్టుల ద్వారా సభ్యులకు ఏపీఎం, సీసీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవోలు, అ కౌంటెంట్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పని కల్పించాలి

● లక్ష్యాలను పూర్తి చేయాలి
● డ్వామా పీడీ విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని అన్ని కుటుంబాలకు 100 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, మార్చి నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్లో అద్దంకి, కొరిశపాడు మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలు, గ్రామాల వారీగా ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను, చేపట్టాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీకి సగటు వేతనం 300 రూపాయలు వచ్చేలా చూడాలని, కూలీలను చైతన్య పరిచి పని చేయించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో లక్ష్యం మేరకు ఫారం పొండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఉద్యానశాఖ ద్వారా అర్హులైన రైతులకు వంద శాతం సబ్సిడీతో ఉద్యాన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు.ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా ఉండకుండా ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్త జాబ్ కార్డు కావాల్సిన వారికి 24 గంటల్లో అందించాలన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలో ఎక్కడా ఎటువంటి తప్పులు జరగకుండా అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసి ప్రభుత్వానికి, మంత్రికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కోటయ్య నాయక్, ఎంపీడీవోలు బత్తిన శింగయ్య, రాజ్యలక్ష్మి, ఏపీవో శోభన్‌బాబు, ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి, ఏపీవోలు గాయత్రిదేవి, కోటేశ్వరి, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పొలం ఉన్న ప్రతిరైతు రిజిస్ట్రేషన్ చేయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

పంగులూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని ముప్పవరం రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ఏవో రామకృష్ణ స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. ముప్పవరం రైతు సేవాకేంద్రంలో స్వయంగా రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అందాలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. రైతులు తమ మొబైల్ నెంబరు ఆధార్‌కు లింక్ చేసుకోక పోయినా ఫేషియల్ అథెంటికేషన్ ద్వారా రైతు రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. 2024 - 2025 సంవత్సరానికి సంబంధించి రబీలో సాగు చేసిన పంటల వివరాలను రైతు సేవా కేంద్రాలలో మార్చి 3వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతులు తాము పండించిన పంట ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన పంట నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి పొందాలన్నా, సున్నా వడ్డీ రాయితీతో పాటు వ్యవసాయ పనిముట్లు పొందేందుకు ఈకేవైసీ విధిగా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో సుబ్బారెడ్డి, రైతు సేవాకేంద్ర అధికారిణి దిల్షా పాల్గొన్నారు.


ముప్పవరం రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

● అద్దంకిలో మూడు పరీక్షా కేంద్రాలు
● హాజరు కానున్న 1,040 మంది విద్యార్థులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో అద్దంకిలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 359 మంది విద్యార్థులు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 410 మంది, వి శ్వభారతి జూనియర్ కళాశాలలో 271 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు ఉదయం గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని 8.30 తరువాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని అధికారులు తెలిపారు.


పరీక్షల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేస్తున్న చీఫ్ రవీంద్రబాబు

ఏర్పాట్లు పూర్తి

బల్లికురవ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ రవీంద్రబాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన కళాశాల సిబ్బందితో మాట్లాడుతూ మొదటిసారిగా బల్లికురవకు పరీక్ష కేంద్రం మంజూరైందని, ఈ కేంద్రంలో బల్లికురవ, కేజీబీవీ, వలపర్ల కళాశాలకు చెందిన 135 మంది పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

చినకొత్తపల్లి పంచాయతీలో రికార్డుల తనిఖీకి ఆదేశాలు

అద్దంకి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొత్తపల్లి గ్రామ పంచాయతీలో గత 5 సంవత్సరాల కాలంలో జరిగిన లావాదేవీల పై విచారణకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. విచారణ అధికారిగా అద్దంకి ఈవో అండ్‌పీఆర్ డి ప్రసాద్‌ని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 2021-22 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో గ్రామ పంచాయతీలో జరిగిన ఖర్చులు, పన్నులు వసూలు తదితర అంశాలపై 10 వ తేదీ లోపు నివేదిక ఇవ్వాలని డీపీవో ప్రభాకరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు స్థానిక తమ కార్యాలయానికి సమాచారం అందినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు. ఉపాధిహామీ నిధుల ద్వారా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి రూ. 15,74,823 ల బిల్లులను పనులు చేసిన టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు చెల్లించకుండా సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శులు నేరుగా బ్యాంక్ నుంచి డ్రా చేసి వేరే వ్యక్తికి చెల్లించారు. దీంతో ఇప్పటికే అధికారులు విచారణ చేసి సర్పంచ్ చెక్ పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేశారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో రికార్డుల పరిశీలనకు డీపీవో ఆదేశించారు.


చినకొత్తపల్లి పంచాయతీ కార్యాలయం (ఫైల్)

ఉచిత వైద్య శిబిరంలో 270 మందికి పరీక్షలు

చినగంజాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు ఆసోది అంజిరెడ్డిల ఆధ్వర్యంలో గ్రామంలోని తూర్పు రచ్చబండ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈశిబిరంలో కంటి, సాధారణ వ్యాదులకు సంబంధించి 270 మందికి వైద్య పరీక్షలు జరిపినట్లు తెలిపారు. బీ.పీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. రోగ నిర్ధారణ జరిగిన 60 మందిని ఒంగోలు హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఈఎస్‌ఐ, ఈహెచ్‌ఎస్, ఈసీహెచ్‌ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, అర్థమెట్రిక్స్ స్వాతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


దగ్గుబాడు - ఇంకొల్లు మధ్య డ్రైనేజ్ వాగును పరిశీలిస్తున్న ఈఈ మురళీ కృష్ణ, డీఈ సుబ్బారావు, రైతులు

ఆలేరు వాగును పరిశీలించిన డ్రైనేజ్ అధికారులు

దగ్గుబాడు(పర్చూరు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : దగ్గుబాడు - ఇంకొల్లు మధ్య ఉన్న ఆలేరు వాగును బాపట్ల జిల్లా డ్రైనేజ్ ఈఈ మురళీ కృష్ణ నేతృత్వంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. వాగులో ముళ్ల చెట్లు పెరిగిపోయి నీటి పారుదల సక్రమంగా సాగటం లేదని, వాగుపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు సైతం మరమ్మతులకు గురయ్యాయని, తక్షణం చర్యలు చేపట్టాలని ఆలేరు వాగు ఫార్మర్స్ కమిటీ అధ్యక్షులు గంటా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులు డ్రైనేజ్ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన డ్రైనేజ్ అధికారులు ఆలేరు వాగును పరిశీలించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆలేరు వాగు పరిస్థితిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయామని, సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారని అన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి చిల్లచెట్లను తొలగించటంతోపాటు, వాగుకు పడిన గండ్లను కూడా పూడ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని డీఈ సుబ్బారావు తెలిపారు.

క్రైం సమాచారం

రాజుగారిపాలెంలో చోరీ


ఇంటిలో దొంగలు పగులగొట్టిన బీరువా

మార్టూరు,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో ఉప్పలపాటి శంకరరాజు అనే వ్యక్తి ఇంటిలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఇంటిలో బీరువాలో ఉన్న 1.30 లక్షల రూపాయల నగదును ఎత్తుకు పోయారు.ఇంటి తాళం కప్పను గడ్డపారతో పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువా తాళాలను ఊడగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకుపోయారు.మార్టూరులో నెట్‌పాయింట్‌ను నిర్వహిస్తున్న శంకరరాజు దంపతులు యథావిధిగా శుక్రవారం ఉదయం మార్టూరు వచ్చారు. అయితే ఇంటిలో ఉన్న శంకరరాజు తల్లి విజయలక్ష్మి గ్రామంలో మందులు తీసుకోవడానికి వెళ్లారు.ఈ సమయంలో దాదాపుగా 11 గంటల నుంచి 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడ్డారు. ఇంటికి వచ్చిన విజయలక్ష్మి దొంగతనం జరిగిన విషయం గ్రహించి కుమారునికి సమాచారం అందించారు. దాంతో శంకరరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్టూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

అద్దంకి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్‌లో మద్యం సేవించి మోటార్ బైక్ నడుపుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 4 రోజులు జైలు శిక్ష, రూ. 3 వేల జరిమానా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శింగయ్య విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. నిందితుడిని ఒంగోలు జైలుకు తరలించినట్లు తెలిపారు.